
# హాస్యమాలిక

VOL-I



సిహెచ్. వి.ఎస్. ఎన్. మూర్తి



**చతుర్వేదుల. వెంకటసత్యనారాయణ మూర్తి**

# కత్తిపీట-వేసవి ఊరగాయల ఊసులు

పూర్వం రోజుల్లో కత్తిపీట లేకపోతే నోట్లోకి ముద్ద వెళ్ళేదికాదు మరి,అలా అని  వాళ్ళు కత్తిపీటలు తినేవాళ్లు అనుకోకండి (ఏదో అని చదువుతున్నాం కదా అని ఇష్టం వచ్చినట్టు రాస్తున్నాడు అనుకోబోకండి) కత్తిపీట లేకుండా కూరగాయలు ఎలా తరుగుతారండీ, కూరలు లేకుండా అన్నం ఎలా తినేవారు- అదన్నమాట!

కత్తిపీట ఈ రోజుల్లో చాలా తక్కువమంది ఇంట్లో ఉంటోంది; ఒక వేళ ఉన్నా అందరూ-పెద్దవాళ్ళతో సహా "చాకే" వాడుతున్నారు కత్తిపీటకి ప్రత్యామ్నాయంగా- ఎవరో ఒకళ్ళో ఇద్దరో తప్ప,ఇదొక అలంకార ప్రాయపు వస్తువు అయిపొయింది చాలా మంది ఇళ్లల్లో. ఇక ఈతరం అమ్మాయిల సంగతి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంతమంచిది ఈ విషయంలో-కత్తిపీటని వాళ్ళ జీవితంలో ముట్టుకోలేదు అన్నా పెద్దగా ఆశ్చర్యపడక్కర్లా-ముట్టుకున్నారు అంటే ముక్కునా, బుగ్గనా వేలేసుకొని సంభ్రమాశ్చర్యాలకు గురి అవ్వాల్సింది మనం.

అసలు కత్తిపీటే లేని ఇళ్లే కోకొల్లలు,వేసవిలో ఊరగాయల సమయంలో మాత్రం ఆవకాయ ముక్కలకు మాత్రం కత్తిపీటే దిక్కు-ఆ కత్తిపీట వేరేది అనుకోండి, చాకుకు,మామూలు కత్తిపీటకు మామిడి టెంక స్వాధీనంకాదు కాబట్టి ఊరగాయ కత్తిపీటే దిక్కు(మామూలు కత్తిపీటతో కూడా ఆవకాయ ముక్కలు కొట్టే ఘనాపాఠీలు కొందరు ఉన్నారనుకోండి) కొంతమంది ఇళ్లల్లో ఏడాది ఏడాదీ ఊరగాయ పెట్టుకొనే ఇళ్లవాళ్ళు మాత్రం- మార్కెట్ లో మామిడికాయలు కొని ఆ అమ్మేవాడి దగ్గరే ఊరగాయముక్కలు కొట్టించుకుంటారు.బహు కొద్దిమంది మాత్రం పెద్ద కత్తిపీట ఇంట్లో ఉన్నవాళ్లు మాత్రం వాళ్ళ ఊరగాయ కాయలు వాళ్ళే కొట్టుకుంటారు- అందరూ కాదులెండి.

మేము ఉద్యోగరీత్యా 2002లో మద్రాస్ లో ఉన్నప్పడు "ప్యారిస్" (ప్యారీ కార్నర్ లో-మళ్ళీ మేం ఏదో ఆవకాయ కత్తిపీట కోసం "పారిస్" వెళ్ళొచ్చాం అనుకుంటారు-వెధవ బడాయిలు చెపుతున్నా అనుకుంటారు) దగ్గర మార్కెట్ లో ప్రత్యేకంగా కొనుక్కున్నాం-షాప్ వాడికి ముందుగా ఆర్డర్ ఇచ్చి మరీనూ.

మాకు మద్రాస్ కొత్తకదా -అలా అంటే మద్రాస్ మొహం మొదటిసారి చూస్తున్నాం అని కాదు,నేను లాగూలు వేసుకున్నప్పటినుంచి వెళ్తూనేవున్నా, లాగూలు వేసుకోనప్పుడు వెళ్లి ఉంటే నాకు గుర్తుండదుగా మరి-ఎవరైనా మా ఇంట్లోవాళ్లు చెపితే తప్ప, ఎవరూ చెప్పలేదు కాబట్టి నిక్కచ్చిగా చెప్పగలను, లాగూలు వేసుకున్నతర్వాతే మద్రాస్ చూడటం మొదలుపెట్టా-నేను చెప్పేది మొదటిసారి మేము మద్రాస్ లో నివసించడం గురించి- ఏవి ఎక్కడ ఉంటాయో ఆట్టే తెలియవు కదామరి!

అందుకని మా ఆవిడావాళ్ళ ఆఫీసులో ఓ కాంట్రాక్టర్ సహాయం తీసుకున్నాం- అతను ఆ కత్తిపీట చూసి బోలెడు "హాశ్చర్యపడటం" కూడా జరిగింది కూడా (మనం కూడా అప్పుడప్పుడు హాశ్చర్యపడుతుంటామే అలాగన్నమాట-తర్వాత మాఅవిడ అతనికి ఓ సీసాలో ఆవకాయ ఇచ్చినట్టు గుర్తు కూడా నాకు) అరవవాళ్ళు ఆవకాయ పెట్టుకోరు కదా-ఏదో ఓ పిల్ల మామిడి కాయలు(మనం చిన్నప్పుడు తింటామే అవి వగరుగా ఉంటాయి కదా) వాటితో "వాడ మాంగాయ" అంటారనుకుంటా అది పెట్టుకుంటారు.మరి వాళ్లకి ఆంధ్రావాళ్ళ ఊరగాయ కత్తిపీట, దాని వాడకం ఎలా తెలుస్తుంది-ఆంధ్ర ఆవకాయ రుచి తెలుసుగాని!అదే ఆంధ్ర ప్రాంతంలో అయితే ఎవ్వరూ పట్టిచ్చుకోరు- మేం ఈ కత్తిపీట కొనుక్కోవడం గురించి!

ఆ తర్వాత ఒక్క ఏడాదో రెండు ఏళ్ళో మాత్రం ఇంట్లో ఊరగాయ ముక్కలు నేనే కొట్టాను.తర్వాతర్వాత మార్కెట్ లోనే కొట్టించడం, మేము పెట్టే పాతిక కాయల ఊరగాయలకి అటకమీంచి కత్తిపీట దింపటం,దాన్ని తుడవటం, సానపెట్టించడం- పదును పోతే-ఇంత తతంగం హడావుడీనూ.

అయినా కత్తిపీటని తప్పుపట్టి దానిమీద నిందవేయడం తప్పే-దాన్ని తరచుగా వాడకుండా ఏడాదికోసారి "సాలుసరి ఉత్సవాలకు" దేవుడి రధాన్ని బయటకు తీసినట్టు తీస్తే అదిమాత్రం ఏం చేస్తుంది తుప్పు పట్టక.మన మెదడైనా అంతేకదా మనం "రోజూవారి" వాడే జాబితాల్లో చేర్చకుండా ఉంటే తుప్పు పట్టదు మరి! మద్రాస్ నుంచి మాతో పాటుగా చాలా జాగ్రత్తగా హైదరాబాద్ తీసుకొచ్చాం దాన్ని కూడా, "అగర్వాల్ పాకర్" కంటైనర్ లో- మేము హైద్రాబాదు కి బదిలీ అయినప్పుడు,అంత జాగ్రత్తగానూ అటకమీద చేర్చాం.

వేసవి రాగానే ఊరగాయలు సమయం కదా అని,అది కిందకి దింపుదాం అని మనసులో కోరిక ఉండేది.అదే మాట ఇంట్లో అంటే, మా అత్తగారూ,మా ఆవిడా "మనం పెట్టే పాతిక కాయల ఊరగాయకి అదేం కిందకి దింపక్కర్లా.మోండా మార్కెట్లో మామిడికాయల వాడి దగ్గరే డబ్బులు ఇచ్చి వాడి చేతే ముక్కలు కొట్టించొచ్చు" అనేవారు.

వాళ్లిద్దరూ ఆ మాట అనటంతో ధైర్యం చేయలేకపోయేవాడిని-మా అత్తగారు మాత్రం మా ఆవిడతో అనేవారు- నా సరదా, నా"చిన్నబోయిన" మొహం చూసి- పెద్దవాణ్ణయినా అప్పుడప్పుడు అలా "చిన్నబోతా" మరి అదేంటో- నాకు సిఫార్సు చేసే ఉద్దేశంతో "పోన్లేవే కత్తిపీట ఉంది, అతను సరదా పడుతున్నాడు" అని.

మా ఆవిడ మాత్రం ససేమిరా అనేది "ఆ కత్తిపీటతో ఏ వేలో కోసుకుంటే,అసలే హడావుడి మనిషి" అనేది- ఆ దెబ్బతో ఆవిడా మాట్లాడేవారుకాదు మళ్ళా.

ఏమాటకి ఆమాటే చెప్పుకోవాలి,మా అత్తగారికి ఓపికి ఉన్నంతవరకు ఆవిడా నేనూ మొండాకి పొద్దున్నే వెళ్లే వాళ్ళమ్.ఓ "నీళ్ల కాన్", రెండు మెత్తటి గుడ్డలు, రెండు బకెట్లు, ఓ చిన్న చాకు, ఈ మొత్తం సరంజామాతో. మేము ఎప్పుడూ మామిడికాయలు కొనేవాడి దగ్గరకే వెళ్లేవాళ్ళం-వెళ్ళేది ఏడాదికి ఒకసారయినా మమ్మల్ని గుర్తుపట్టి పలకరించేవాడు!

మాగాయ్ కాయ, ఆవకాయ కాయ రుచులు చూడటం- చూసి చూసి, పళ్ళు ఎదో లాగా (జివ్వున) అయిపోయేవి-(ఓ రెండు రోజులు ఎక్కడ రేకుల చప్పుడు అయినా నా పళ్ళమీద ఎవడో గీస్తున్నటుగా ఉండేది కూడా) అన్ని కాయల రుచులతో-పులుపు ఉంటే పీచు ఉండేది కాదు, పులుపు, పీచు ఉంటే కాయలో రసం ఉండేది కాదు- ఎన్ని లెక్కలు, ఎంత విశ్లేషణ- ఆవకాయ పెట్టడం కాదు, దానికి తగ్గ కాయలు కొనటమే గొప్ప అనుభవంతో కూడుకున్న పని మరి. అందుకే మన "మహానటి డాక్టర్ పద్మశ్రీ భానుమతి రామకృష్ణ గారు" కూడా అత్తగారి పేరుతోనే ఓ కథల పుస్తకం రాశారు- నేను రాయబోవటం లేదు- మీరేం కంగారు పడబోకండి-ఇతగాడు రాసే అవన్నీ కూడా చదవాలా అని!

ఇక మేము ఎంచుకున్న కాయలు తీసుకోవడం అయిన తర్వాత, మేము తెచ్చిన నీళ్ల కాన్ నీళ్లు బకెట్లో పోసి వాటిల్ని సుబ్బరంగా కడిగి బట్టమీద ఆరేసి,తొడిమెలు తీసిపెట్టేవాళ్ళం- వాడు వాటిల్ని ముక్కలుగా కొట్టాలిగా మరి.

ముక్కలు కొట్టేటప్పుడు వాడి కత్తిపీట కింద మేము తీసికెళ్ళిన బట్ట పెట్టేవాళ్ళం- పద్ధతి పద్దతేగా మరి-వాడు ముక్కలుకొట్టిన తర్వాత జీడిముక్కలు, పచ్చటి తెల్లటి పొర వస్తుందిగా టెంకని ఆనుకొని వాటిల్ని జాగ్రత్తగా చాకుతో తీసేవాళ్ళం- ఇంటికి ఒచ్చిన తర్వాత.

మా అత్తగారిని చూసి- పెద్దావిడ- ఆ తరం ఆవిడ కదా- చాలా మంది ఆడవాళ్లు వచ్చి అవిడ సలహాలు తీసుకునేవారు-ముక్కల విషయంలో,కారం, ఆవపిండి, వగైరా.కొంతమంది అయితే ఊరగాయ ఎలా పెట్టాలి మామ్మగారు అని కూడా అడిగేవారు.

వాడు మాకు కాస్త ధర తగ్గిచ్చి ఇచ్చేవాడు-"ఎవరైనా మిమ్మల్ని ఆడిగితే మీకిచ్చిన ధర చెప్పకండి" అనేవాడు.మాకు లోపల పీకుతుండేది-కానీ వాడి వ్యాపారం, కొనుక్కునే వాళ్ళ బేరం చేసే సామర్ధ్యం కదా మరి-మేము గమ్మున కూచ్చునే వాళ్ళం వాడు మమ్మల్ని చూడకపోతే ఒకళ్ళిద్దరికి మాత్రం ఒక ధర చెప్పి దీనికి బేరం ఆడండి,అటూ ఇటుగా- అని గుంభనంగా మా పని మేము చేసుకునేవాళ్ళం.

ముక్కలు కొట్టేటప్పుడు కూడా ఓ రూపాయి తగ్గిచ్చే వాడులెండి మాకు. ఏదైనా ఇంత సరంజామాతో కార్లో రావడం,

ఇంటికి వెళ్లేముందు ఇంతా మళ్ళీ కార్లో పెట్టుకోవడం ఓ పెద్ద ప్రదర్శనలాగా ఉండేది, సరదాగా. చాలామంది చేతులూపుకుంటూ ఓ బాగ్ వేసుకుని వచ్చేవారు మరి-ఇంత ముందస్తు ఏర్పాట్లు అందరికి తట్టవుగా మరి. మాకంటే మా అత్తగారు-నేనూ ఇంట్లోనే ముందు రోజే అన్నీ చూసుకునేవాళ్ళం మార్కెట్ కి తీసుకెళ్లాల్సినవన్నీ- ఏవైనా నేను మర్చిపోయినా ఆవిడ చెప్పేవారు- ఓవేళ మేమిద్దరం ఏదైనా మర్చిపోతే వెనకాల మా అవిడ ఉందిగా.కాన్ లో మిగిలిన నీళ్లు మాత్రం (మంచి నీళ్లు కదా) ఆ షాప్ వాడికి ఇచ్చి వచ్చేవాళ్ళం- వేసవి కాలం కదా అంచేత. మాగాయ కాయలు మాత్రం పీలర్ తో చెక్కుతీసి ఇచ్చేవాణ్ని-మా చిన్నతనంలో ఊరగాయల సమయంలో మునేరుకి వెళ్లి ఒడ్డున ఆల్చిప్పలు ఏరుకొచ్చేవాళ్ళం- "నందిగామ" మా ఊరు అని మునుపే చెప్పాను కదా-మీకు గుర్తుండే ఉంటుంది బహుశా; వాటిని కొద్దిగా అరగదీసి చిల్లు పడేంతవరకు సిద్ధం చేసుకుని ఇంట్లో ఉంచేవాళ్ళం. నలుగురు పిల్లలం కూచ్చోని వాటితో మాగాయ కాయ చెక్కులు తీసేవాళ్ళం!

అప్పట్లో ఊరగాయలు వందల్లో పెట్టేవాళ్ళు- పాతికా పరకా కాదు ఇప్పటిలాగా! మార్కెట్ నుండి వచ్చిన తర్వాత మిగతా కార్యక్రమాలన్నీ మా అత్తగారే చూసుకునే వారు.మధ్యలో ఏదైనా సహాయం, గిన్నెల్లో సర్దటాలు, జాడీలలోకి పెట్టడాలు వగైరాల్లో మా ఆవిడ ఓ చేయివేసేది- ఇలా రకరకాల పాత్రల్లో పెట్టే దాంట్లో నా పాత్ర ఏమీ ఉండేదికాదు.

హైదరాబాద్ లో ఉన్నంత కాలం "అంబటి సుబ్బన్న-సామర్లకోట వాళ్ళ నూనే" వాడేవాళ్ళం-అతి శ్రేష్టమైనది,ప్రశస్తమైనది కూడా ఊరగాయలకి- బెంగళూరు వచ్చాక కూడా ఓ రెండేళ్లు ఇక్కడ కూడా అత్తయ్యగారు అదే నూనెతో ఊరగాయపెట్టారు కూడా!

ఇప్పుడు ఎవరికీ పెట్టే ఓపికా లేదు,తినే తీరుబడీ లేదు, తింటే అరిగించుకునే శరీరాలు లేవు.చాలా మంది బజార్ లో కొనేసుకుంటున్నారు ఊరగాయలు ఇప్పుడు. ఏదైనా వేసవికాలంలో ఊరగాయలు పెట్టడం అంటే ఆ రోజుల్లో ఒక పెళ్ళికి సిద్ధమయ్యే ఉత్సాహం ఉండేది-ముందస్తు ఏర్పాట్లతోనే ప్రతి ఇల్లు సందడి సందడిగా ఉండేవి-ఆ సందడి అంతా ఇప్పుడు కర్రీ పాయింట్లకి వెళ్ళిపోయింది. ఏదైతేనేం కొన్నేళ్లు హాయిగా పెద్ద కత్తిపీటకి అటకమీదే విశ్రాంతి ఇచ్చాం వాడకుండా.కొన్నేళ్లక్రితం మా సోదరుడి కొడుక్కి ఇచ్చినట్టు గుర్తు, బహుశా వాళ్ళఇంట్లో కూడా అటకమీద ఎంచక్కా విశ్రాంతి తీసుకుంటూ ఉంటుంది పాపం నోరులేని పిచ్చిమొహం!

ఎందుకైనా మంచిది మీ ఇళ్లల్లో కత్తిపీట, ఊరగాయ కత్తిపీట ఉంటే- కాసిన్ని ఫోటోలు తీసి ఉంచుకోండి మీ ఫోటో ఆల్బంలో పెట్టుకోవచ్చు-కొన్నాళ్ళకి అవి కూడా కనపడవు కదా మరి. తర్వాత తరం వాళ్ళకి చూపించవచ్చు- మన మూతికి మాస్కులు పెట్టుకున్న ఫొటోలతో బాటు.

## గడ్డం - ఉపయోగాలు, ప్రయోజనాలు, లాభాలు...

తరచుగా గడ్డం చేయాల్సిన పనిలేదు!

క్షౌరశాలకు నిత్యం వెళ్ళక్కర్లేదు!

సబ్బు ఖర్చు తక్కువ!

మామూలు నీళ్లతో కడుక్కున్నా మొహం తాజాగా ఉంటుంది!

గడ్డాల ట్రిమ్మింగ్ చేసి చేసి- క్షౌరశాల నిపుణుల "నైపుణ్యం" పెరుగుతుంది - ఆ "పుణ్యం" గడ్డంమొహం వాళ్లదే!

గడ్డం మొహాన్ని ఆట్టే జనం గుర్తు పెట్టుకుంటారు!

ఇంకోమారు ఏ షాపుకి వెళ్లినా గుర్తుపట్టి పలకరిస్తారు!

ఎంత గుంపులో ఉన్నా "చుక్కల్లో చంద్రుడిలా" టక్కున గుర్తుపడతారు!

కొత్తవాళ్లు కూడా రెండోసారి చూసినప్పుడే గుర్తుపట్టేస్తారు! అవతలవాళ్ళకు కూడా సులువు ఇతరులకు చెప్పడానికి, ఆనవాలు పట్టడానికి - "ఆ గడ్డం మనిషి" అని! గడ్డంవల్ల గ్రామర్ తో సంబంధం లేకుండా గ్లామర్ వచ్చేస్తుంది!

వర్ణబేధం లేకుండా ఏరంగు మొహమైనా గడ్డం పెంచుకోవచ్చు! గడ్డంవల్ల మొహం కొద్దిగా నిండుగా కనపడుతుంది! గడ్డం చేసుకుంటేగానీ బయటకు వెళ్ళకూడదు అనే నియమమే ఉండదు! గడ్డం మొహానికి ఓ కళ్ళజోడు తగిలిస్తే ఆ స్టయిలే వేరు!

ఎంతమందిలో అయినా ప్రత్యేకంగా కనిపిస్తారు! మన ఇంటిపేరు గడ్డం అయిపోతుంది కొంతమందికి!

ఇంకో గడ్డంవాడు చూసాడంటే (అందరు కాదనుకోండి) పలకరింపుగా నవ్వేస్తాడు,స్వజాతివాణ్ని చూసినట్టుగా -వాడు సీరియస్ గా ఉండే మనిషి అయినా సరే! గడ్డంవల్ల మొహం రంగు మారదు-ఫెయిర్ అండ్ లవ్లీ వాడకుండానే!

నల్లమొహం తెల్లబడదుగానీ-రంగు నిలబడిపోతుంది- మొహం కారునలుపు అవకుండా! మొక్కల ఆకుల కత్తిరించే నైపుణ్యం ఉంటే- గడ్డం ఇంట్లోనే ట్రిమ్మింగ్ చేసుకోవడం సులువు-మొక్కల కత్తెరతో మాత్రం కాదు!

గడ్డంవల్ల మోహంలో కడుక్కునే ప్రదేశం తగ్గిపోతుంది! అశ్రద్ధతో ట్రిమ్మింగ్ చేయడం ఆలస్యం అయినా గడ్డంమొహం బానేఉంటుంది- రోజువారీ గడ్డంచేసేవాడు మాత్రం ఓ రెండురోజులు గడ్డం గీయకపోతే జబ్బుపడ్డవాడిలా ఉంటాడు!

ఏదైతేనేం- పైన చెప్పిన లాభాలతో పాటు ఇంకో విషయం ఏమిటంటే- గడ్డంవున్న మొహంవాడు ఓ మేధావిలా కనపడతాడు పరులకు-ఇదో పేద్ద ప్రయోజనం కదూ! అర్థం అయ్యింది కదా-గడ్డంవల్ల లాభాలు-ఆలస్యం అయినా పర్వాలేదు- మొదలు పెట్టండి గడ్డం పెంచడం!

సందేహించకండి,మొహమాటపడకండి-ఎవరో ఏదో అనుకుంటారని- మన మొహం, మన గడ్డం, మన ఇష్టం!
ఇంకో పెద్ద విషయం ఏమిటంటే- గడ్డం పెంచటానికి పెట్టుబడి ఉచితం - ఆర్యభట్టగారు కనిపెట్టిన “జీరో”-సున్నా! ఇవి కాకుండా వేరే ఇంకైనా లాభాలు ఉంటే తెలియచేయండి- తెలుసుకొని సంతోష పడతాను!

మరోమాట-కరోనా ధర్మమా అని గడ్డపు వాళ్ళ సంఖ్యా బాగా పెరిగిపోయిందని (నా లాంటివాళ్లు అన్నమాట)క్షౌరశాలల వాళ్ళు గగ్గోలు పెడుతున్నట్టుగా ఆ మధ్య పేపర్ లో వార్త చదివాను.ఏడాది తర్వాత మొన్నామధ్య  నేనో క్షౌరశాలకి వెళ్ళినప్పుడు దాని యజమాని  నాతో కూడా వాపోయాడు!

నా స్నేహితుల్లో ఒకనికి కొచ్చిన్ లో ఓ యూనిసెక్స్ హెయిర్ అండ్ బ్యూటీ  సెలూన్ వుంది-అతను అదే వాపోయాడు-వ్యాపారం బాగా దెబ్బతింది అని. ఇప్పుడు దేశమంతటా పరిస్థితులు దాదాపుగా యధాస్థితికి వచ్చాయి;అన్నిరకాల వ్యాపారాలు పూర్వపు స్థాయికి తొందరగా రావాలని అందరూ త్వరగా కోలుకోవాలని ఆశిద్దాం. ఇంకోమాట-ఈ ఆన్ లైన్ కొనుగోళ్లు కాస్త పక్కనపెట్టి- బయటకివెళ్ళి-

ప్రత్యక్షంగా అన్నీ కొనటానికి ప్రయత్నం చెయ్యండి-అప్పుడేగా అందరి వ్యాపారాలు త్వరగా కోలుకునేది. మనిషి రోడ్డున పడ్డాడు-ఇంట్లోంచి-అన్నీ అంతటా పనిచేస్తున్నాయి; అయినాకూడా మన జాగ్రత్తల్లో మనం ఉందాం!

# అలా ఎందుకు అవుతుంది...

మనం ఎదురుగుండా ఉన్నంతసేపూ పొంగని పాలు ఒక్కక్షణం పక్కకి చూసే లోపులే పొంగుతాయి ఎందుకు! వర్షం అనుకోకుండా పడుతుంటే గబగబా వెళ్లి బయట ఆరేసిన బట్టలు అన్నీతీసి ఇంట్లోకి రాగానే వర్షం ఆగి భళ్ళున ఎండ వస్తుంది ఎందుకు! గోరింటాకు పెట్టుకున్నప్పుడే ముక్కుకి దురద పెడుతుంది ఎందుకు! కరెంటు పోయినప్పుడు మాత్రమే ఇంట్లో కొవ్వొత్తులు అయిపోయిఉంటాయి ఎందుకు! చీటికీ మాటికీ పొయ్యే కరెంటు పరీక్షలప్పుడు పోదెందుకు!

రోజూవచ్చే వర్షం బయటికి గొడుగుతో వెళ్ళినప్పుడు రాదెందుకు! నేను ఆవులిస్తే పక్కవాడు కూడా ఆవులించడం ఎందుకు! టి.వి లో వాళ్ళు ఆవులుంచినప్పుడు కూడా మనం ఆవులిస్తామెందుకు! బస్సు ప్రయాణంలో పక్కవాడు నిద్దరోతే మనం కూడా పోతామెందుకు!

కార్ లో వెళుతున్నప్పుడు, తటాలున ముందు అద్దంమీద- పైనుంచి నీళ్లు ఒక్కసారే పడ్డప్పుడు ఉలిక్కిపడి సీట్ లో వెనక్కి జరుగుతాం ఎందుకు! ఉలిక్కిపడి హఠాత్తుగా భయపడ్డప్పుడు నోటితో థూ..తూ అంటూ మనచేతితో వీపుపై మూడుసార్లు తట్టుకుంటాం ఎందుకు! ఇంట్లో అన్నీ ఉన్నప్పుడు ఆకలివేయకుండా,ఇంట్లో ఏ చిరుతిళ్ళు లేనప్పుడే ఆకలేస్తుంది ఎందుకు! ఒక్కళ్ళమే కాఫీ తాగేటప్పుడు చటుక్కున వెళ్లే మన చేయి-స్నేహితులతో కాఫీ తాగేటప్పుడు పర్సు దగ్గరకు మెల్లిగా వెళ్తుంది ఎందుకు!

హోటల్ లో మెనూ చూసినా- పక్కవాడి ప్లేట్ లో చూసిన తర్వాత ఆర్డర్ ఇస్తాం ఎందుకు! రైల్ లో వెళ్ళేటప్పుడు ఎదుటివాడు భోజనం తినటం మొదలుపెడితే గాని మనం తినం ఎందుకు! మొబైల్ ఫోన్ బ్యాటరీ ఆఖరిగీతలో ఉండగానే అర్జెంటు కాల్స్ వస్తాయి ఎందుకు!

సులభ్ టాయిలెట్ కి వెళదామనుకున్నప్పుడే చిల్లర ఉండదు ఎందుకు! చీరలషాపులో బొమ్మకు కట్టిన చీర మొదట్లో నచ్చక షాపు అంతా తవ్వి చీరకొన్నాక బొమ్మకు కట్టిన చీరే నచ్చుతుందెందుకు! అబ్బాయి తననే చూస్తున్నాడని అమ్మాయి అతని వైపు చూడకుండానే ఆ అమ్మాయికి తెలుస్తుంది ఎలా! ఎప్పుడూ కళ్ళముందు విపరీతంగా తిరిగే ఓలా- ఊబర్ కార్లు, మనకి కావలసినప్పుడు ఎప్పుడూ ఆలస్యంగా వస్తాయి ఎందుకు! మనకి కావాల్సిన వస్తువు అవసరం అయినప్పుడు ఇంత వెతికినా దొరకనిది- అవసరం తీరాక దొరుకుతుంది ఎందుకు! మన ఎంత పైఅంతస్థులో ఉన్నా- కిందికి రోజూ దిగుతూనే ఉన్నా- కిందివాళ్ళ మీద చిన్నచూపు ఎందుకు! "నీ, నా"అనే తేడాలేకుండా,మనస్ఫూర్తిగా, అరమరికలు లేకుండా మాట్లాడేవాళ్ళం- ఇప్పుడు వడకడుతూ (ఫిల్టర్ చేస్తూ) ఆచితూచి-కృత్రిమంగా మాట్లాడుతున్నాం ఎందుకు!

ఇందులో చాలావరకు సహజమైనవే, మరికొన్ని మనలో వచ్చిన మార్పు;

మనిషి చాలా మారిపోయాడు, పరిస్థితులు కావచ్చు, స్వభావం కావచ్చు, స్వార్ధం కావచ్చు, గర్వం-అహంకారం చేరి ఉండొచ్చు -గతాన్ని మర్చిపోయి ఉండొచ్చు, కారణాలు ఏమైనా సరే.మరీ అంతలా మారాలా-అంత స్వార్ధం అవసరమా,మూలాల్ని,మన ఉనికికి మూలమైన వాళ్ళను మర్చి బతికేస్తుండటం ఏమి గొప్పతనం- అదో గొప్పతనమా. ఏమి సాధించామని జీవితంలో, మనలా సంపదలతో, ఆర్జనలతో కొన్ని కోట్లమంది ఉన్నారుగా- ఏమిటి గొప్పతనం-పూర్వం ఓ సామెత ఉండేది "ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమా" అని!

తమ ఒప్పూ తమ పచ్చా చూసుకోవడమేనా ఎప్పుడూ-చుట్టుపక్కల పరిసరాలు, మనుషులతో కూడా పరస్పరం పరిచయాలు, సంబంధాలు పెంచుకోవచ్చుగా-ఇందులో డబ్బు ఖర్చేమీ కాదుగా! తనకు, తన కుటుంబానికి వెలుపల విశాలప్రపంచం ఉంది-అందులోంచే ప్రతి ఒక్కరూ వస్తారు- ఇతరులతో మన అవసరాలు తీరాక పోనుపోనూ గిరి, గళ్ళు గీసుకొని బతికేస్తున్నాం - అదీ ఓ జీవితమేనా-దానికి ఓ సార్ధకత ఉందా?

మానవుడు స్వతహాగా సంఘజీవి-కాలక్రమేణా స్వార్ధజీవి అయిపోయాడు- ఆత్మపరిశీలన,అంతర్మధనం చేయాల్సిన సమయం వచ్చింది అని అనిపించట్లా. మన ప్రవర్తన, స్వార్ధం మనతీరు మన పిల్లలు చూస్తున్నారుగా- "ఆవు చేలో మేస్తుంటే, దూడ గట్టునుంటుందా".అదే వాళ్ళూ నేర్చుకుని మనల్ని మించి స్వార్ధజీవులు అయితే! మన ముదిమిలో- వాళ్ళు మన బాటపడితే, మనం వంటరి అయిపోమా-ఇలా జరగదని హామీ లేదుగా, ఖచ్చితత్వం లేదుగా!

మనం ఇలా తయారు అవుతామనేనేమో-అందుకనే 150 ఏళ్ల పూర్వమే స్వామి వివేకానంద అన్నారు. "పిల్లలు మీమాట వినడం లేదని అనుకోవడం కాదు, మిమ్మల్ని చూసి నేర్చుకుంటారు అని తెలుసుకోండి"

చక్కగా, నిస్వార్ధంగా బతకడానికి పెద్ద నేర్పరితనం అక్కర్లేదు, పెద్ద మనసు ఉండాలి-అందరి గుండె గుప్పెడేగా; ఆ గుండెనే కొద్దిగా లోపల విశాలంగా చేసుకుంటే జీవితం సుఖమంతం అవుతుంది!గుండె పెద్దది అయి డాక్టర్ దగ్గరకి వెళ్ళేకంటే- అదే గుప్పెడు గుండెతో మంచిగా బతికేస్తే పోలా!

"ఇట్స్ బెటర్ టు హావ్ లార్జ్ హార్ట్ దాన్ ఎన్ లార్జ్డ్ హార్ట్"

## పదనిసలు...

**పొగ త్రాగుడు మానడం ఎలా!**
**(పొగ తాగడం ఎలా అని నేర్పక్కర్లేదు కాబట్టి)**

నా స్నేహితుడు ఒకడికి సిగరెట్లు చెడతాగే అలవాటు ఉంది- చెడతాగుతాడు కాబట్టి ఏదో చెడిపోయాడని కాదు-ఊపిరి తిత్తులు చెడిపోవచ్చు అనే భయం అంతే!

అందరి బాధా భరించలేక, వాడికీ మనసులో పీకుతోంది అనుకోండి "కొద్దిగా తగ్గిస్తే బాగుండును" అని-ఆమాట పైకి ఎవరితో అనలేదనుకోండి-నాతో తప్ప. ఎలాగైతేనేం ఓ శుభముహూర్తాన వశీకరణనిపుడిని-"వైద్యుడు" అని అనలేంగదా (హిప్నాటిస్ట్) దగ్గరకు వెళ్లడం జరిగింది.వాడొక్కడేకాదు, నేను కూడా తోడుగా వెళ్ళాననుకోండి- వాడికి తోడుకోసమే కాదు- వశీకరణ నిపుణుణ్ణి చూడాలనీ, అసలు ఎలా జబ్బు నయం చేస్తాడో అనే కుతూహలం కూడాను.

ఇద్దరినీ కూర్చోబెట్టి కొన్నివిషయాలు,విడివిడిగా మా ఇద్దరినీ కొన్ని విషయాలు అడిగాడు. స్థూలంగా ఈ కింది విధంగా సాగాయి ఆయన ప్రశ్నల పరంపర... ఈ అలవాటు ఎప్పటినుంచి, రోజుకి ఎన్ని సిగరెట్లు, ఎన్ని ప్యాకెట్లు! ఒక్కడే ఉన్నప్పుడు ఎక్కువ తాగుతాడా, స్నేహితులతో ఉన్నప్పుడు ఎక్కువ తాగుతాడా! స్నేహితుల్లో వీడికంటే ఎక్కువ తాగేవాళ్ళు ఉన్నారా, లేక వీడే ఎక్కువ తాగుతాడా!

సొంత డబ్బులతో కొనుక్కుంటాడా, లేదా ఉచితంగా వస్తాయని తాగుతాడా!

స్నేహితుల సిగరెట్లకు కూడా డబ్బులు ఇస్తాడా,లేదా ఎవరి డబ్బులతో వాళ్ళే కొనుక్కుంటారా!

ఎవరైనా ఆడస్నేహితురాలు ఉందా,ఉంటే ఆ అమ్మాయి ముందు కూడా తాగుతాడా!

ఆ అమ్మాయికి కూడా అలవాటు ఉందా,ఆ అమ్మాయి స్నేహితుల్లో ఎవరికైనా ఈ అలవాటు ఉందా!

కాఫీ ముచ్చట్లు చేసేటప్పుడు సిగరెట్టు తాగుతాడా!

మీవాడికి మందు అలవాటు ఉందా- ఆ అమ్మాయికి తెలుసా-రహస్యంగా ఉంచాడా!

తెలిసినా అభ్యంతర పెట్టదా,ఆ అమ్మాయికి కూడా అలవాటు ఉందా! మీ వాడి ఇంట్లో తెలుసా మీవాడు ఇంత పీకుడుగాడని! మూడు సంవత్సరాల డిగ్రీ సమయంలో గానీ, ఉద్యోగవేటలో ఇంటర్ వ్యూ ల్లోగానీ ఇన్ని ప్రశ్నలు ఎదుర్కోలేదు ఇలాంటి ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు- మావాడి జీవితచరిత్ర రాసేంత సామగ్రి, విషయాలు రాబట్టాడు నాదగ్గర నుంచి;నాకో అనుమానం వచ్చింది వీడు ఏమైనా గూగుల్ కి గానీ పేస్ బుక్ కి గానీ ఏజెంట్ ఏమో అని.

ఓరి నాయనోయ్-యక్షుడు కూడా ధర్మరాజుని ఇన్ని ప్రశ్నలు వేసి ఉండడు-వేసి ఉంటేనా-అంతటి ధర్మరాజు కూడా ఆ యక్షుడి బుర్ర రామకీర్తన పాడించి ఉండేవాడు.ఆ ప్రశ్నలన్నీ నేనిప్పుడు రాసానంటే నా అడ్రెస్ కనుక్కొని మరీ వచ్చి కొట్టిపోతారు-అంత రిస్క్ చేయలేను.

చెప్పొద్దూ నాకు మాత్రం ఈ నిపుణుణ్ణి ఓ పీకు పీకుదామన్నంత కోపం వచ్చింది; కానీ అంతలోనే తమాయించుకున్నా; నేను పీకుతే- మా వాడి సిగరెట్ల పీకుడు మానటానికి నివారణోపాయం-మార్గం మూసుకుపోతుందిగా-ఆ దెబ్బతో మా వాడు ఓ నాలుగు పీకులు నన్ను పీకొచ్చు-అంచేత అన్నమాట! వెధవ పితలాటకం వాడి ఆప్తస్నేహితుణ్ని అవటం మూలాన!

ఇలా ఓ రెండు దఫాలు ఇరుపక్షాలకు సమావేశాలు నడిచాయి ఓ పక్షం రోజుల్లో- నేను మావాడికి తోడుగా మాత్రమే "అనుసరించేవాణ్ణి"-అలా అంటే ఏదో వాడికి తెలియకుండా అని కాదు- వాడితోపాటుగా వెళ్ళేవాణ్ణి అని అర్థం.మన తెలుగులో ఉన్న నానార్థాల వల్ల వెధవ అపార్థాలకు పోవచ్చు కొందరు- ఆ నిపుణుడూ మా వాడూ ఆంతరిక చర్చలు నడిపేవారు- నా నిమిత్తం లేకుండా!

ఏమి ప్రభావమోగానీ మావాడు పీకుడు దూకుడు కొద్దిగా తగ్గించాడు అనే చెప్పవచ్చు-ఇలా రెండునెలలు వాళ్ళిద్దిరా మధ్య సెషన్స్ నడిచాయి.ఈ- కామర్స్- ఈ - టైలింగ్ ఈ-మెయిల్-ఈ బుక్ -అంతా "ఈ" లేగా ఈ రోజుల్లో- ఆ సిగరెట్టు నుంచి ఈ- సిగరెట్టుకి బదిలీ అయిపోయాడు మావాడు.

క్రమేపీ మా వాడికి సిగరెట్టు తాగే అలవాటు దాదాపుగా పోయినట్టే అయింది, కాకపోతే ఓ కొత్త అలవాటు అంటుకుంది.ఎలక్ట్రానిక్ సిగరెట్లు గుప్పు గుప్పున పీలుస్తున్నాడు-కాల్చడం బదులుగా-ఈ పీల్చే వాసనలుకూడా రకరకాలుగా దొరుకుతాయి.

ఇందులో ఉండేదీ నికోటినే- చూడటానికి పెన్ లాగానో, యు.ఎస్.బి డ్రైవ్ లాగానో, ఉండేది.నికోటిన్ కాల్చి పీల్చేవాడు కాస్తా- నికోటిన్ ని తిన్నగా పీలుస్తున్నాడు ఇప్పుడు.

మావాడిలో "ఈ" మార్పు రావడం కోసం ఆ నిపుణుడికి చాలా వేలే తగలేశాడు మావాడు- రెంటి చేతివేళ్ళకంటే ఎక్కువే "స్మోకింగ్" లోంచి "వేపింగ్" లోకి వచ్చాడన్నమాట;తర్వాత కొన్నాళ్ళకి తెలిసింది- ఈ-సిగరెట్టు ఆ సిగరెట్టు కంటే- మాహాప్రమాదకారి అని.

రెండునెలల్లో మావాడూ నేనూ ఆ నిపుణుడి దగ్గరకు వెళ్లాల్సి రావచ్చు"ఈ" సిగరెట్టు ఎలా మానేయాలో తెల్సుకుంటే మళ్ళీ "ఆ" సిగరెట్టుకి మావాడు చేరుకుంటాడు!

ఇప్పుడు "ఈ" సిగరెట్టు వ్యసనాన్ని వదిలి ఆ సిగరెట్టు తాగడం ఎలా అలవాటు చేసుకోవాలో ఆ వశీకరణ వాడి దగ్గర మావాడు వెళ్లి నేర్చుకోవాలి- లేకపోతే ఈ వ్యసనం నుంచి వాడు బయటపడేది ఎలా!

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా ఆ కబురుకోసం మావాడి నోటినుంచి!

ఈ అనుభవం మూలంగా ఈ సందర్భంగా అందరికీ  ఓ చిన్న ఉచిత సలహా – పారేస్తున్నా (సలహా ఉచితం అయితేనే ఎవరూ తీసుకోవడం లేదు, డబ్బులిచ్చి ఎవరు కొంటాడు మన దగ్గర నుంచి) పట్టించుకోకపోయినా పర్వాలేదనుకోండి- అయినా సరే ఎప్పటిలాగా చెప్పడం మాత్రం మానను- మీ వెధవ అలవాట్లు మీరు మానినా మానకపోయినా-నా స్నేహితుడికి మల్లే!

అలవాట్లు- వెధవ అలవాట్లు-దురలవాట్లు అంటే అందరికీ తెలుసు-అవి అర్థం చేసుకుని వాటి జోలికి వెళ్లకుండా ఉండటం మంచిది-లేదంటే ఇదిగో ఇలా మా వాడిలా మీరూ అయిపోతారు.అప్పటికి మీకేదో తెలియదు అని కాదు- నా చేతిదురద కాబట్టి ఇంత రాసా!

ఇంక ఉంటా- బోల్డు పనులున్నాయి- బయట చక్కపెట్టేవి

# "ప్రీ డయాబెటిక్"!

"ప్రీ డయాబెటిక్" అనేది- గుమ్మం ముందు వచ్చి నుంచున్న మనిషిలాంటిది, ఏదో గుమ్మం బయటే ఉందని-మర్యాదకు లోపలకు పిలిచి “ఉండమ్మా బొట్టు పెడతా” అంటే ఏమవుతుంది.మన ఇంట్లోనూ-ఒంట్లోనూ తిష్ట వేసుకుని కూర్చోదూ; ఆపైన తీపి అయిన ప్రేమతో ఇంట్లో ఉన్నవాళ్ళ ఒంట్లోకి కూడా  వెళ్ళదూ!

“ఒద్దమ్మా,నువ్వు లోపలి రాకు, కాస్త నోరు కట్టేసుకుని, ఒళ్లుదగ్గర పెట్టుకుని ఉంటా” అని చెప్తాం కదా.లేదూ “ఇప్పుడు తీరిక లేదు, వీలుచిక్కినప్పుడు నేనే కబురుపెడతా” అని కదా చెప్పాలి.

"ప్రీ డయాబెటిక్"వరద వచ్చేముందు చేసే ప్రమాద హెచ్చరిక లాంటిది! ఇక మనం తినే విషయంలోనూ,బ్రతికే విధానంలోనూ కావలసిన మార్పులు చేసుకోవాల్సిన సమయం వచ్చింది అని అర్థం -కష్టం అనిపించినా సరే.ఇహ ఇప్పటివరకు మన ఇష్టం వచ్చినట్టు తిని బతికేసిఉంటాం- ఇప్పుడైనా దానికి ప్రీతికరమైన పనులు మానేసి,పదార్థాలు తినడం మానేసి - మన దరిచేరకుండా ఉండే రకంగా మారాలి.

అంతేగానీ ప్రీ డయాబిటిక్ ఏమైనా అనుకుంటుంది అని ఇంట్లోకి పిలిచి పీటవేసి భోజనంపెట్టి తాంబూలం ఇస్తే మీవంట్లోనే ఎల్లకాలం ఉండిపోతుంది-అప్పుడు దీన్ని ఫ్రీ డయాబిటిక్ అంటారు.
కొంతమందికి మాత్రం పాపం శరీరం తీరో,వంశ పారంపర్యంగానో, ఇంకా ఇతర కారణాల వాళ్ళో గానీ ఎంత జాగ్రత్తగా ఉన్నా వీటి బారిన పడతారు.

ఒక్క తిండేకాదు, మన మారిన జీవిన విధానం, వత్తిడి, ప్రేమా ఆప్యాయతలు  లేకుండా స్వార్ధంతో బతికేయడంవల్ల కూడా మెదడుమీద వీటి ప్రభావం ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే ఇవన్నిటిని మానసిక రోగాల కింద జమకట్టవచ్చు- నా లెక్కప్రకారం-జనాభాలో ఎక్కువ శాతం మంది ఇలాగే బతుకుతున్నారు కూడా. దీనికంటే శ్రేష్టం ఏమిటంటే అసలు డయాబిటికే రాకుండా ఒళ్ళు,మనసు జాగ్రత్తగా చూసుకుంటే బాగుంటుంది- దానితో బాటు మన చుట్టుపక్కలవాళ్ళని కూడా జాగ్రత్తగా చూసుకుంటే ఇంకా మంచిది-అప్పుడు మనం “డయాబిటిక్ ఫ్రీ” కదా!

మనకు ఆరోగ్యం మీద అంత శ్రద్ధా-ప్రాధాన్యత లేదేమోగానీ మన శరీరానికి కావాలి కదా-మనం అందులోనేగా-ఉన్నది, ఉండేది, ఉండబోయేది మరి!

ఆరోగ్యం కావాలంటే ఆ మాత్రం ముందు జాగ్రత్త అవసరం కదా ఎవరికైనా!

# జడ పురాణం...

**ఆ... జడా...అని కొట్టిపారేయకండి- జడకి చాలా పెద్ద సీనే ఉంది**

**“ఓ వాలు జడా మల్లెపూల జడా**
**ఓ పాము జడా సత్యభామ జడా”**

**జడ గురించి రాధా గోపాలంలో ఓ అందమైన పాటని స్నేహ, శ్రీకాంత్ ల మీద బాపూగారు అద్భుతంగా చిత్రీకరించారు.అది మణశర్మ, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గార్ల ఉభయుల మస్తిష్కంలోంచి జాలువారిన పాట- ఆ పాట చిత్రీకరణ గురించి నేను ప్రత్యేకంగా వర్ణించనవసరం లేదు-అదో అద్భుతః!**

**జడవేయని ఆడవాళ్లు, ఆ జడలని (జడతోపాటు ఆ జడ తాలూకూ యజమానులని కూడా అనుకోండి) పొగడని మొగవాళ్ళు ఉంటారా ఈ లోకంలో- జడపదార్థాలే కదా జడలని, వాటి హక్కుదారుల్ని పొగడకుంటే! అలాగే మన కవులు జడలలో రకాలను కూడా వర్ణించారు-ఇప్పుడు కేశాలంకరణ నిపుణులు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు పెళ్లిళ్లలో వాళ్లకున్న నైపుణ్యంతో- పెళ్ళికూతురికి వేసే పెళ్లి జడలపై!**

**వాలు జడ**
**పూల జడ**
**పొట్టి జడ**
**పొడుగు జడ**
**చింపిరి జడ**
**కొత్తిమీర కట్ట జడ**
**నాగుపాము లాంటి జడ**
**పలకల జడ**
**పాయల జడ**
**కుచ్చుల జడ**
**మల్లెల జడ**
**పలకల జడ**
**చక్రాల జడ**
**వంకుల జడ**

**ఇంకా మరెన్నో....**

ఈ జడల అల్లిక అంటే ఆషామాషీ కాదు,దానికి చాలా నైపుణ్యం,అనుభవం ఉండాలి. ఇంట్లో ఈ అనుభవం ఉన్న పెద్దవాళ్ళు ఉన్నా అంత జుట్టు ఉన్న ఆడపిల్లలు ఎందరు-ఓవేళ ఉన్నా ఇలా జడల అల్లికలు చేయించుకునేవాళ్ళు ఎందరు; ఇప్పటితరం అమ్మాయిల్లో ఏ కొద్దిమందికో పెద్దజడ వేసుకునే జుట్టూ ఉంటుంది, కొద్దిగా జడల అల్లికలో అనుభవమూ ఉంటుంది!

ఉన్న జుట్టు ఎంత- ఆ ఉన్న జుట్టుకే ఓ రబ్బర్ బ్యాండ్ తగిలించుకోవడమో, రకరకాల క్లిప్పులు తగిలించుకోవడమో చేస్తుంటారు "జుట్టు ఉన్నమ్మ ఏ కొప్పయినా పెట్టుకుట్టుంది" అని వెనకటికి ఓ సామెత- ఆ సామెత అవసరమే లేదు ఈ రోజుల్లో- అంతగా కావాలంటే సవరంతో అవసరం తీర్చేసుకోవచ్చు అనుకోండి- పొడుగు జుట్టే కావాలా!

జడ అనేది గత దశాబ్దం పైగా అమ్మాయిలు చాలామంది మర్చిపోయినవాళ్లే; మహాఅయితే కాలేజీ చదువులవరకు ఉండి ఉండొచ్చేమో- అదీ కొద్దిమంది మాత్రమేనండి - వాళ్ళు జడ వేసుకొని వెళ్లి ఉంటారు. అది కూడా ఏ ప్రభావాలకు, స్నేహితుల ఒత్తిళ్లకు లొంగకుండా ఉన్న జుట్టు కత్తిరించుకోకుండా ఉంటే.

ఉద్యోగాల్లో చేరడం ఆలస్యం- కురులు పురివిప్పినాట్యమే నెమలిపింఛం లాగా "కురులబంధనం" అనేదే లేదు,కానీ వీళ్లందరూ జీవితంలోమరొక్కమారు వేసుకుంటారు తప్పకుండా-వాళ్ళ పెళ్లికి పూలజడ-సవరం సహాయంతో;లేదంటే అదీ అక్కర్లేదు ఉన్న ఆ నాలుగు వెంట్రుకలకే డిజైనర్ పూలజడ కుట్టేస్తారు!

చివరకి తేలింది ఏమిటంటే- జుట్టే ఉండనవసరం లేదు కొప్పు పెట్టుకోవడానికి- ఓ కేశాలంకరణ నిపుణినికి తల అప్పచెప్తే ఎడమ చేత్తో వేసేస్తారు ఎలాంటి కొప్పు అయినా.కొన్నాళ్ళకి పొడుగు జడలు ఉన్న అమ్మాయిల్ని ఈ నూటికో కోటికో ఒకళ్ళని చూస్తామేమో!

అదృష్టవశాత్తూ మీకు అలా పాముకుబుసం లాంటి జడల జాడలు కనపడితే మాత్రం కాస్త పక్కకు ఆగి, నిమ్మళంగా చూసి (జడని మాత్రమే) మళ్ళీ మీ దారిన  మీరు వెళ్ళండి.మోటార్ సైకిలు మీదో, కార్ లోనో వెళ్తూ వెళుతూ మాత్రం ఆ పని చేయబోకండి-ఆక్సిడెంట్ అయిపోగలదు జాగ్రత్త-

జడ సంగతి తర్వాత జవసత్వాలు మొత్తం పోయి ఆసుపత్రి పాలు అవగలరు-పైపెచ్చు ఇంట్లో సంజాయిషీలు ఇచ్చుకోలేక చావాలి మళ్ళీ,ప్రమాదానికి తోడుగా.

# కాఫీపోఖ్యానం...

కొత్త సంవత్సరం నా మొట్టమొదటి రాతలతో మీ అందరికీ మంచి వేడివేడి,
రుచికరమైన కాఫీ ఇద్దామనే ఉద్దేశంతో...

ఈ పాటికే మొదటి గుక్కలు గొంతులోకి వెళ్లి ఉంటాయి-ఇది చదివిన తర్వాత రెండో కప్పు నేను ఇచ్చినట్టుగా భావించి లాగించేయండి-సంకల్పంలో నాపేరు చెప్పుకుని మరీనూ! నేనూ ఇది రాసి, ఈ వంకన రెండో కప్పు లాగించేస్తా...

మీకు కాఫీ చేయడం రాదనోనో,బాగా కాఫీ పెట్టరనో- నేనీ కాఫీపోఖ్యానం చేయడం లేదు సుమా- అంత్యనిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలు అందుకే ముందే చెప్పేస్తున్నా! (మీరు మాఇంటికి వస్తే ఓ కప్పు మాంచి కాఫీ లభిస్తుందని భరోసా ఇవ్వడం  కోసమే నా ఈ తాపత్రయమంతా- అంతేగానీ కీర్తి కండూతికి కాదు)

మంచి సువాసన-రుచి గల కాఫీ కావాలంటే "అరబికా" కాఫీ గింజలు మాత్రమే  ఎంచుకుని మర పట్టించాలి-అందులో చికోరీ ఏ మాత్రం కలపకూడదు.డికాషన్ పలచగా ఉంటుంది సాధారణంగా- కాస్త చిక్కగా కావాలంటే ఫిల్టర్ లో పొడి ఎక్కువ వెయ్యాలి (కోట శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్ లా కాకుండా) ఎప్పటికప్పుడు మనం కాఫీ కలుపుకునేటప్పుడే పచ్చిపాలు కాచి  కాఫీకి వాడాలి. ఇది అసలు సిసలైన- "స్వచ్ఛమైన" ఫిల్టర్ కాఫీ-ఇది నా దృష్టిలో ఉత్తమమైన, శ్రేష్టమైన, రుచికరమైన కాఫీ!

చిక్కటి గేదెపాలు దొరికితే స్వర్గంలో ఉన్న అనుభూతే అనుకోండి- అయినా మనకు దొరికేది బూతుపాలే కదా ఎక్కువగా ఈ రోజుల్లో! ముందుగా కాచిన పాలతో కలిపితే కాఫీ రుచి రాదు, "యేడిగా ఉన్నా యేడిసినట్టే" ఉంటుంది- అలా కలిపితే!

అలా కాకుండా "చికోరి" కలిపిన కాఫీ తాగే అలవాటు ఉన్నవాళ్లు "రోబస్టా" కాఫీ గింజలు వాడటం ఉత్తమం, ఇవి స్వతహాగా "అరబికా" కాఫీ గింజల కంటే చిక్కగానే ఉంటాయి-గింజ తీరే అంత-చికోరి కలపకముందే;సాధారణంగా హోటల్స్ వాళ్ళు ఇచ్చే కాఫీలో  వాడేది- ఈ గింజల కాఫీ పొడే చికోరితో కలిపినది. లేదంటే ఇంకో చిట్కా ఉంది-చికోరి కలపకుండా డికాషన్ చిక్కగా ఉండాలంటే....

70:30 దామాషాలో అరబికా:రోబస్టా కాఫీగింజలు మర ఆడించి ఆ పొడి వాడితే- చికోరి వేయకుండానే డికాషన్ చిక్కగా ఉంటుంది-సువాసనా ఉంటుంది.

అరబికా పంట విస్తీర్ణం తక్కువ-దిగుబడి తక్కువ (అరటిపళ్ళలో చెక్కర కేళీ లాగా) అంచేత కొద్దిగా ధర కూడా ఎక్కువే మరి-కానీ ఆ రుచి ముందు ధర దిగదుడుపే నిస్సందేహంగా-ధర ఎక్కువ పెట్టాం అనే ఫీలింగే ఉండదు!

కాఫీ తాగేది మన కడుపుకేగా, అందునా పొద్దున్నే లేవగానే తాగే మొదటి చుక్క- దేవతల అమృతంలా- అమృతం కదా అని పొద్దస్తమానం వాళ్ళూ తాగరు అనుకోండి -వాళ్ళు కూడా ఈమధ్య అప్పుడప్పుడు కాఫీ తాగుతారని తెలిసింది- అదీ దేవేంద్రుడికి తెలియకుండా- శచీదేవికి (ఇంద్రాణి, పులోమజ అని కూడా అంటారు ఈవిడని) తెలిసిన ఆ రహస్యం తన దగ్గర అట్టే పెట్టేసుకుంది- దేవతలకి ఒట్టు వేసి మరీను.

అయినా వాళ్ళ భ్రమగానీ కాఫీ వాసన దేవేంద్రుడి ముక్కుపుటాల దాకా చేరకుండా ఉంటుందా ఏదో రోజున-బహుశా ఆ వాసన సోకిన తర్వాత ఇంద్రుడు కూడా కాఫీ సేవనం మొదలు పెడతాడని ఇంద్రాణి మనసులో నమ్మకం, ఆశా అయి ఉండొచ్చు కూడా- భర్త సంగతి భార్యకి తెలియక ఇంకెవరికి తెలుస్తుంది- "అమ్మపుట్టిల్లు మేనమామకు తెలిసినట్టు" అదీ కాకుండా దానితో ఆవిడ అక్కడా ఇక్కడా కాఫీ తాగే బాధ తగ్గుతుంది-ఎంచక్కా ఇంట్లోనే ఎప్పుడు కావాలంటే అప్పుడే కలుపుకొని తాగచ్చు.

ఇంత చెప్పినా మీకు అనుమానం రావచ్చు-నేనేదో బడాయి కబుర్లు చెప్తున్నా అనీ ఈ కాఫీ స్వర్గానికి ఎలా చేరింది అని; ఏం- పారిజాతవృక్షం చూసి సత్యభామ మోజుపడితే శ్రీకృష్ణుడు భూలోకానికి తేలా స్వర్గాన్నించి. కాకపోతే ఇక్కడ ఈకాఫీ  భూలోకం నుంచి స్వర్గ లోకానికి ఎగుమతి అయ్యింది-పుణ్యం కట్టుకుంది మాత్రం నారదమహామునే.సకలలోక సంచారకుడు కదా- ఓ మారు భూలోకానికి వచ్చినప్పుడు ఓ మహాఇల్లాలు ఇచ్చిన ఓ కప్పు కాఫీతో అదిరిపోయాడు.

ఆ దేవతలు అమృతం తాగుతూ మానవులకు అది లభ్యం కాదు కదా అనే సంబరపడిపోతున్నారు.ఆ వెర్రిబాగులవాళ్ళకి తెలియలేదు ఇక్కడ అమృతాన్ని మించిన పానీయం ఒకటి ఉందని (ఆయనికి తెలిసింది కూడా ఆ మహాఇల్లాలి ధర్మమా అనే కదా) అదేమాట నారదమహాముని ఆ ఇల్లాలికి నమస్కరించి ఆవిడతో అనేశాడు కూడా. కాఫీగత ప్రాణులకి ఇది ఓ శుభ వార్తే -ఇక్కణ్ణుంచి అక్కడికి వెళ్లినా కాఫీ మిస్ అవ్వం మరి!

నారదుడు మంచిపనిచేసాడు- లేకపోతే నేను ఇక్కణ్ణుంచి వెళ్ళేటప్పుడు- "కూర్గ్" ప్రాంతం నుంచి ఓ రెండు కాఫీమొక్కలు తీసికెళ్ళి స్వర్గంలో పాతేద్దాం అనుకున్నా-అయినా తీసికెళ్తాలెండి- పనిలో పని ఓ గేదెని కూడా తీసుకెళ్తే పోలా-నిత్యమూ కాఫీ దొరుకుతుంది-నాకు ఇబ్బందీ ఉండదు; అదీకాక,కాస్త దేవతల్ని మచ్చిక చేసుకోవటానికి కూడా ఉపయోగపడుతుంది.

అసలు ఈ కాఫీ గొడవ ఎత్తటానికి కారణం కాఫీ గురించి చెబుదామని కాదు- “మాకు తెలిసిన కాఫీ గురించి ఇంత సోది చెప్పి మళ్ళీ ఇదేంటి” అనుకుంటున్నారా! ప్రతి నిత్యం మన గొంతు తడిపేది ఈ కాఫీ చుక్కలే కదా- దాదాపుగా ప్రాణవాయువు లాంటిది- (ఐ.సి.యూ లో వెంటిలేటర్ లాగా) కాఫీగతప్రాణులకి .ఈ విషయమే చాలాచక్కగా- మహానుభావుడు జొన్నవిత్తులవారు ఆశువుగా ఓ అష్టకమో, శతకమో రాశారు కాఫీ మొహాన్న.

ఈ మాత్రం కాఫీయే ఇంత కష్టపడితేగానీ రాదు కదా ("ఈ మాత్రం" అనే మాట అనడం ఇష్టం లేకపోయినా, “కాఫీకి-జీవితానికి” ఉన్న సారూప్యత చెప్పడం కోసమే రాసాను- లేకపోతే కాఫీయే నా ప్రాణం మరి) మరి జీవితంలో కూడా కాఫీలాగే ప్రతినిత్యం, అద్భుతంగా ఉండాలంటే ఇంకెంత కష్టపడాలో ఆలోచించండి.

అంచేత జీవితంలో కష్టపడటం నేర్చుకుందాం, అలవాటుగా కూడా చేసుకుందాం- "కష్టే ఫలి" అని ఊరికినే అన్నారా మన పెద్దవాళ్ళు.అలా చేయకలిగితే జీవితాంతం- రోజూ మాంచి కాఫీ తాగుతూ ఉండచ్చు గుటుక్కుమనేవరకూ -చివరి గుక్కవరకూ తాగుతూ.

ఏదో "కాఫీ తాగే తాగుబోతు మాటల్లా నా మాటలు కొట్టివేయకండి" కాఫీయే కదా నిక్షేపంగా తాగేయండి ఎన్ని కప్పులైనా-కాఫీ, వ్యసనం కాదుగా మరి!

ఇక ఉంటా- కాఫీ తాగే టైం అయింది, అయినా కాఫీ తాగటానికి టైం ఏమిటి-వేళాపాళా లేకుండా తాగేదే కాఫీ! ఎన్ని కప్పులైనా తాగొచ్చు...

కాఫీ చాలా రుచికరమైనది.అంతా మన చేతల్లో, చేతుల్లో...

ఓ కాఫీ ప్రియుడు

# ఇంట్లో సుఖ శాంతులు ఉండాలంటే...

ఇంట్లో పెళ్ళాంతో విసిగిపోయి ప్రశాంతత కోల్పోయిన కుటుంబరావు ఓ సాధువు- సన్నాసి కాదు-దగ్గరకు వెళ్ళాడు!

"స్వామీ,నేను  ప్రతీ రోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేస్తుంటాను.ఎంత సర్దుకున్నా ఇంట్లో గొడవలు తప్పడం లేదు ప్రశాంతత ఉండటం లేదు" అని తన గోడు వెళ్లబోసుకున్నాడు.

అది విన్న సాధువు"నాయనా అవేమి చేయకుండానే నీ వంట్లో,నీ ఇంట్లో కూడా మానసిక ప్రశాంతత ఉండే తారకమంత్రం ఉపదేశిస్తాను" అన్నాడు.

"అంతకంటేనా స్వామి, కనీసం మీ దయవల్ల శేష జీవితమైనా హాయిగా గడిపేస్తాను" అన్నాడు కుటుంబరావు మహదానందంతో- తాను వచ్చిన పని అంత సులువుగా అయిపోతున్నందుకు!

"ఇకనుండి నీ భార్య నీతో మాట్లాడేటప్పుడు గానీ,నువ్వు మాట్లాడేటప్పుడు గానీ, ఈ నాలుగు పదాలే వాడుతూ ఉండు, నీకు- నీ ప్రశాంతతకు ఢోకా లేదు" అని కింది పదాలు చెప్పాడు

"అవేమిటి స్వామీ అంత మహత్తు కలిగినివి" అన్నాడు కుటుంబరావు కుతూహలంగా, ఆత్రుత పట్టలేక------
ఇవే నాయనా అవి...

"అలాగే", "సరే", "నీ ఇష్టం", "నువ్వే కరెక్ట్"

అది విన్న మన అమాయకపు కుటుంబరావు"ఓస్ ఇంతేనా"అన్నాడు!

"నాయనా ఆ పదాలు అలవాటు పడటం అంత సులభం కాదు (అంత సులభమైతే నాకీ దుస్తులు దాపరించేవి కాదు అని మనసులో అనుకున్నాడు సాధువు)

కానీ ఇవి అలవాటు అయితే మాత్రం ఇంట్లో నీకు ప్రశాంతత లోపం ఉండదు, మళ్ళీ నువ్వు నా దగ్గరకు ఈ విషయమై రావాల్సిన పనే ఉండదు" అన్నాడు సాధువు!

కుటుంబరావుకి చిన్న అనుమానం వచ్చింది!

“స్వామీ విషయం ఇంత చిన్నదైనప్పుడు మీరు సన్యాసం ఎందుకు తీసుకున్నారు మీకెవరూ ఈ మంత్రోపదేశం చెయ్యలేదా” అని అడిగాడు మన వెర్రి కుటుంబరావు చాలా అమాయకంగా!

అప్పుడు సాధువు"సంసారంలో ఉన్నప్పుడు-నేనూ భార్య బాధితుణ్ణే- ఆ పదాలు వాటి అర్థం తెలిసినా అవి వాడలేక పోయాను.వేషం మార్చిన తర్వాత ఎక్కడలేని ప్రశాంతత వచ్చింది.ఇక ఆ పదాలతో నాకు పనిలేదు అందుకే నీకు ఇచ్చేస్తున్నా అవన్నీ అన్నాడు.అయినా ఇప్పుడు చాలా సుఖంగా ఉన్నాను,

అలా అని నాలా అవ్వమని బోధ చెయ్యట్లేదు నాయనా, కిటుకు మాత్రమే చెప్తున్నా అన్నాడు సాధువు

మన కుటుంబరావు వీటిని సాధనచేసి తారకమంత్రంగా వల్లెవేస్తున్నాడని,తన శేషజీవితమంతా సుఖంగా జీవిస్తున్నాడని ఆశిద్దాం!

మీలోకూడా ఓ కుటుంబరావు ఉంటే మీరుకూడా ప్రయత్నం చేయండి- నా వరకు నేనూ సాధన చెయ్యడానికి ప్రయత్నిస్తూనే ఉన్నా!

భగవంతుడి పిలుపు వచ్చేలోపే ఈ మాటలు త్వరగా అలవాడాలని ఓ పిచ్చ కోరిక!

## పిల్లలు, కన్నె పిల్లలు-నగవుతో బాటు నగకూడా అందం!!

పిల్లలు, కన్నెపిల్లల అల్లరి అంతంత కాదు-పిల్లలల్లరి కన్న-కన్నెఅల్లరెక్కువే
ఏంచేతనంటే కన్నెపిల్లలో "కన్నె"కలదు మరి పిల్లల్లో కన్నెలేదాయె గదా!

కానీ ఏ కన్నెపిల్లా ఈ రోజుల్లో నగలే పెట్టట్లేదు...

కాదేదీ కవితకి అనర్హం అని శ్రీశ్రీ అన్నట్టు! "కాదే నగా అనర్హం ఆభరణంగా"! కన్యే పుట్టి "కన్యా రాశి" లో ఉంటే మాత్రం ఏం ప్రయోజనం,కాసుల ఆభరణాలు లేకుండా! అప్పట్లో కన్యా రాశి కన్నెపిల్లలే కాదు అన్ని రాసులవాళ్ళు- రాసులకొద్దీ కాకపోయినా- ఒంటి నిండా బంగారు ఆభరణాలు పెట్టుకునే వాళ్ళు-ఒక్క పెళ్ళిళ్ళప్పుడు మాత్రమే కాదు-ఈ మాదిరి కన్యారాసులు ఇప్పుడు కరువయ్యారే!

ఏమైనా అంటే బంగారం ధర స్వర్గానికి చేరువలో ఉంది, మనకెక్కడ అందుతుంది అనేవాళ్ళు వున్నారు, ఇది వాస్తవం కూడానూ అయినా సరే మిగిలిన దుబారా ఖర్చులు తగ్గిస్తే ఓ పిసరు బంగారం కొనుక్కోలేరా ఏమిటి-మాల్స్, సినిమా హాల్స్, వీకెండ్ పార్టీలు, స్పాలు కొద్దిగా తగ్గిస్తే, తిండి వీధుల్లో (ఈట్ స్ట్రీట్స్) తిరగడాలు కాస్త తగ్గిస్తే చాలదూ!

ఈ కింద జాబితా ఎంతమంది ఆడపిల్లలకి తెలుసు ఈ రోజుల్లో, ఏదో బహు కొద్దిమందికి తప్ప!!!

ఏడు వారాల నగలు
చేతికి వంకీలు
పాపిడి బిళ్ళ
నడుముకు వడ్డాణం
కాలికి పట్టాలు
చేతికి మూరెడు గాజులు
ముక్కుకు ముక్కెర
చెవులకు దుద్దులు
వేళ్ళకి ఉంగరాలు
కాలికి మంజీరాలు
ముంజేటి మంజీరాలు
జడ కుచ్చులు
వేలికి మెట్టెలు

తలలో పువ్వులు
పెదాలపై నవ్వులు
సిగ్గూ,బిడియాలు
వయ్యారాలు-నయగారాలు

ఏవి-ఇవి అన్నీఏవి-ఇవన్నీధరించిన ఒక్కవనిత కనరాదేమి- కానరాదేమి!!!

కనడానికి కాంతలున్నారు,వీక్షణకి నయనాలున్నాయి! అయ్యారే,మరి నిరీక్షణ తప్పదా- ఈలాటి వనితని కాంచుటకు!!!

స్వప్నంలో కూడా "స్వప్న" దర్శనం ఇచ్చింది కూడా ఇవేవీ లేకుండానే-పొట్టి పొట్టి,చాలీచాలని దుస్తులతో, ఒక్క నగాలేకుండా,ఉత్తి నగవుతోనే- కలలోనే కాదు ఇలలో కూడా!ఆ నగవందానికి, ఒక "నగ" తోడైతే ఆ అందమే వేరు- వీటికి తోడు మొహాన ఓ బొట్టు-"చిరుదయినా" పర్వాలేదు- ఒక్కసారి ఇవి పెట్టుకొని మీకు మీరే చూసుకోండి అద్దంలో- అద్దం అబద్ధం చెప్పదుగా!

ఏమైపోయారు,కొత్తతరంతో వీరంతా తెరమరుగై పాయారా;వీరందర్నీ సినిమాలలోనే చూడాలా?మిగతా రాసుల కన్యల సంగతి ఎలాఉన్నా,కనీసం కన్యారాశి కన్యలన్నా (పెళ్ళికిముందు అందరూ కన్యలూ-కుమారిలే కదా, అంచేత అందరు కన్యలూ అని) వేషధారణ,ఆభరణాలతో కనపడచ్చు కదా!

బిగుతు బట్టలూ,అవీ అరకొరగా; పై దుస్తులు వేసుకోవడం- లోదుస్తులు కనపడటం కోసమే అన్నట్టుగా వస్త్ర ధారణ.పైపెచ్చు మగో ఆడో తెలియని వస్త్రధారణ. "స్త్రీ స్వతంత్రం" అనే ఒక నినాదంలో పడ్డట్టు ఉంది "కొంతమంది నారీమణులు" ఈ నారీలోకంలో,తాము స్త్రీలమే అనే సంగతే మరిచి.ఇదేదో మేల్ షేవనిజాం (Male chauvinism) అనుకోకండి!

పాతరోజులు వెనక్కి జరపడం సాధ్యంకాదు కానీ,కొత్తతరం వారు,పాతలోని కొత్తని గ్రహించి మెలుగుతే బాగుంటుంది,పాతపడరు-దీనివల్ల క్రొంగొత్తగానే ఉంటారు, కనిపిస్తారు కూడా! ప్రస్తుత కరోనా పరిస్థితులవల్ల, అందరి స్థితిగతులు కొద్దిగా తారుమారు అయ్యాయి.కొత్త అలవాట్లు నేర్చుకున్నాం.కొత్తగా జీవించడం అలవాటు చేసుకున్నాం- కాంచలేని ఆ సూక్ష్మజీవికి సర్వదా కృతజ్ఞులం!

ఏదో మనసులో మాట చెప్పా-నా విన్నపాన్నికూడా ఒక చేవిలో వేసుకోండి,రెండో చెవులోంచి వదిలేయకుండా- ఆ రెండు చెవుల మధ్య బుర్ర ఉందిగా అందులోకి! మీరుమారినా మారకపోయినా మాతరం ప్రేమలూ,ఆప్యాయతలు మీమీద అలాగే ఉంటాయి,మీరు ఎలాగున్నా-మేము మాతరం కాబట్టి, మీ యువతరంలా కాదు!

# మనిషి - ప్రత్యేకమైనవాడు!!!

ఈ మనిషి అనే జీవి సృష్టిలో ఉన్న సకల చరాచరజీవుల్లో ప్రత్యేకతలున్నవాడు- మిగిలిన జీవుల్లా కాదు!

నిత్యం ఓ వస్తువునో, ఓ కోరికనో కోరుతూనే ఉంటాడు,వాడి కోరికలు ఎలా ఉంటాయంటే, నిత్యం ఊటలు ఊరే ఏటిగట్టునుండే "చలమల్లాగా"- అసలు ఇంకిపోవడం అనేదే ఉండవు- చలమలు-వాటిలో నీళ్లు!

ఒక కోరిక కోరి, అది తీరేంతవరకూ-అది వస్తువయితే అర్రులు చాచటమే,ఎప్పుడు వస్తుందా అనో, ఎప్పుడు కొంటానా అనో నిత్యా పారాయణే దానిగురించి,ఏ
"లలితా సహస్రనామాలో, విష్ణు సహ్రస్రనామాలో" కూడా అంత శ్రద్ధగా చేయడు; చివరాఖరికి ఆ వస్తువుని చేజిక్కుంచుకుంటాడు.ఎవరెస్టు ఎక్కినంత సంబరపడతాడు (కింద నుంచి ఇంట్లోకి వెళ్ళడానికి ఉన్న ఇరవైమూడు మెట్లు మాత్రం ఎక్కలేడు- లిఫ్ట్ కావాలి దానికి)

ఆ వస్తువు మీద వ్యామోహం తీరడానికి ఆట్టే సమయం కూడా పట్టదు- వాంటెడ్ లిస్టులో ఉన్న కొత్తవస్తువుకి టిక్కు పెట్టేయడం,ఇంక దానికోసం తపస్సు మొదలు. మరి ఇంతకుముందు కొన్న వస్తువుకి ఇదే తపన కదా-అప్పుడే దాని విలువ పోయిందా, వ్యామోహం పోయిందా-కొత్త మోజు తీరిపోయింది- "కొత్త చీపురు ముందు బాగా ఊడుస్తుంది" అంటారే అలాగన్నమాట-కొంతకాలానికి పాత పడిపోతుంది. కొత్త వస్తువుకు తపస్సు- అది ఫలించడం, దానిమీద పడ్డ కోరిక తీరడం, కొన్నాళ్ళకి దానిమీద మోజు తీరడం- దాదాపుగా చివరి మజిలీ వరకూ అందరు మనుషులదీ ఇదే తంతు -ఎవరో కాస్త తృప్తి, వివేకం ఉన్నవాళ్లు తప్ప!

దీనికి అంతేలేదు,వాడి అంత్యదశ వరకూ- పోనీలే పాపం కదా కష్టపడి సంపాదించాడు వీటిల్ని కూడా ఆ జీవితో తీసుకెళ్లనిద్దాం అనే స్పృహ భగవంతుడికి ఉందా అంటే- ఆయన అంతే.ఈ మానవుల్ని సృష్టించి వీటన్నిటి మధ్య పడేసి, సంపాదించండి,వీటిని కొనుక్కోండి అని చెప్పింది ఆయనే.చివరాఖరికి వీటిని తీసుకెళ్లడానికి "నిబంధనలు" ఒప్పుకోవు అంటాడు- ఇదేమి న్యాయం, ఇదేమి ధర్మం.

పైపెచ్చు "అయినా అవన్నీ మీకు చెప్పిన తర్వాతే ఇక్కడికి పంపించా, ఇప్పుడు నామీద నెపం వేస్తే ఎలా" అంటాడు.ఎక్కడో పైలోకంలో ఎప్పుడో చెప్పినవి మనకు ఏం గుర్తుండి చస్తాయి ఇన్ని సమస్యలతో ఇక్కడ సతమతం అవుతుంటే!

ఈ మాటే పోయినవారం మాముచ్చట్ల మధ్యన అడిగేసా కూడా ఉండబట్టలేక!
అయన కొద్దిగా జాలిగా చూసాడు నా వైపు- "నువ్వు అడిగింది ధర్మమే- కానీ ఇబ్బడిముబ్బడి పెరిగిపోయే ఈ జనాభా- ఈ రాకపోకలతోనే రద్దీ పెరిగిపోయింది- వచ్చే పోయే మనుషులతోనే; ఇక ఈ వస్తువుల్ని కూడా అక్కడికి అనుమతిస్తే అక్కడ స్థలం ఎంతవున్నా చాలదుగా" అని ఆయన గోడు వెళ్లబోసుకున్నాడు నాతో - చెప్పొద్దూ- చచ్చేంత జాలేసింది దేవుడి మీద.ఓదార్పుగా "ఊరుకోవయ్యా" అన్నా నేను.

ఓక్షణం ఆగి ఓ రహస్యం చెపుతా నీకు అన్నాడు "అసలు ఈ మనుషులందరూ ఇక్కడ వదిలేసిన వస్తువులకు- మరికొన్ని కలిపి (వాళ్ళు చేసే మంచిపనులు చూసి) వాళ్లందరికీ రాబోయేజన్మలో మళ్ళీ ఇస్తున్నాకదా- ఇవి నేనిచ్చేవే కదా  లేకపోతే వీళ్ళకి అప్పనంగా వాళ్ళ ప్రతిభకి దొరుకుతున్నాయా ఏమిటి" అన్నాడు!

"చిక్కు ఎక్కడఅంటే- వీళ్ళకి గత జన్మ గుర్తు ఉండదు కాబట్టి-ఇవన్నీ గుర్తుఉండవు (నేను పాత మెమరీ కార్డు తీసి పంపుతా కదా) అందుకని ఇలా అనుకుంటూ ఉంటారు.ఈ విషయం నువ్వయినా చెబుతావని నీ చెవిన వేసా" అన్నాడు.  నేను అన్నా "మంచి పని చేసావు ఇది చెప్పి-లేకపోతే నేను కూడా వీటన్నిటిని ప్యాకింగ్ చేయించి నాతో ఎలా తీసుకురావడం అని ఆలోచిస్తున్నా" ఆయనతో.

"నువ్వూ ఏం తీసిపోలా-అందరిలాగే నువ్వూనూ" అన్నాడు "అలా కాదు స్వామీ ఏదో మీతో కాస్త పరిచయం ఉంది కదా అందుకని" అని నసిగాను! "నీలాంటివాళ్ళు చాలామంది ఉన్నారు-నువ్వొక్కడివేకాదుగా- కాకపోతే మీలాంటివాళ్ళకి ఓ సౌకర్యం కల్గిస్తా- వచ్చే జన్మలో మీ పాత మెమరీకార్డులో ఉండే కొన్ని విషయాలు ఉంచేస్తా. దానితో మీకు అవగాహన ఉంటుంది మన పరిచయం, మన సంభాషణలూనూ-మనిద్దరిమధ్య అపోహలూ, అపార్థాలు ఉండవు" అన్నాడు.

"కాస్త పూర్వజన్మపు మంచివాసనలు తెలుస్తాయి కనుక- మీ ఆధ్యాత్మిక స్థాయి ఇంకొద్దిగా పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు.నాకూ ఉంటుంది కదరా తొందరగా మీరందరూ నాలో కలిసిపోవాలని-ఎప్పుడూ నాలోనే మీరంతా ఉండాలని-నాకు ఇలాంటి కోరికలు ఉంటుంటాయి" అని నవ్వాడు!"ఆ మాత్రం చాలు స్వామి ఈ సామాన్లన్నీ ఇక్కడే వదిలేస్తా- నీ దగ్గరకి వచ్చి మళ్ళీ ఇక్కడికి వచ్చాక అన్నీ కొత్తవి కొనుక్కుంటా, అలాగే ఇంకొన్ని సామాన్లు కూడా ఇస్తావుగా వీటితోబాటు,అక్కడికి ఇవి  తీసుకెళ్లే బెడద కూడా తప్పింది- ఈ పాత సామాన్లు నాకెందుకు, కొత్త శరీరం- కొత్త సామాన్లూనూ" అన్నాను నవ్వుతూ ఉత్సాహంగా!

"నువ్వు తక్కువవాడివి కాదురా" అన్నాడు వెళ్లేముందు నవ్వుతూ!!

అయన అలా వెళ్ళాడు, నేను నిద్రకి ఉపక్రమించాను-నేనూ ఆయనా ఇలా తరచుగా కబుర్లాడుకుంటాం అనే సంగతి మా ఆవిడకి కూడా తెలియదు- రహస్యం కదా ఎంతైనా!

అదర్రా సంగతి, అంచేత మీరు కొనుక్కున్నవన్నీ శుభ్రంగా ఇక్కడే వాడుకోండి- అక్కడికి తీసుకెళ్లడం కుదరదు- మళ్ళీ వచ్చినప్పుడు కొత్తవి కొనుక్కోవచ్చు- ఇంకా చాలా ఇస్తా అంటున్నాడుగా ఆయన- ఏమంటారు!

# రకరకాల వ్యక్తులు సమాజంలో...

కింది సంభాషణలు చదువుతుంటే ఏదో జంధ్యాల సినిమాల్లో పాత్రల్లాగా అనిపిస్తాయి;కానీ ఒకసారి జంధ్యాలగారే చెప్పారు, "తాను సినిమాల్లో సృష్టించే పాత్రలు తన నిజజీవితంలో తారసపడినవే- సినిమా కాబట్టి కొద్దిగా విశేషణాలు జోడిస్తుంటా" అని.

ఈఉపోద్ఘాతం ఎందుకంటే కింద మీరు చదవబోయే పాత్రల్లో కొన్నిగానీ, అన్నీ గానీ,కనీసం ఒక్కటన్నా గానీ మీరూ మీజీవితంలో చూసే ఉంటారు అని ఎందుకో నాకు ఓపిచ్చ నమ్మకం- ఓ వేళ మీలో ఒకటి రెండు లక్షణాలున్నా కంగారుపడొద్దు-ఒక్కోసారి మనలోవున్న కొన్ని లక్షణాలు మనకే తెలిసి చావవు-అవతలివాళ్ళు చేప్పేదాకా!

సాధారణంగా ఎవరికైనా ఒంట్లో బాలేకపోతేనో, ఏదైనా అవుతేనో పరామర్శ చేస్తాం. తెలిస్తే జాలిపడతాం, అయ్యో పాపం అనుకుంటాం! అలా కాకుండా ఈ కింది రకంగా వ్యాఖ్యానాలు చేసే వ్యక్తుల్ని చూసారా!

మచ్చుకి కొన్ని...
రామానికి జ్వరం వచ్చిందట!

ఆ... జాగర్తగా ఉండకపోతే జ్వరం రాదూ
(ఏమిటో జ్వరం చెప్పివస్తుందా-జాగ్రత్తగా ఉంటే మాత్రం రాదా-విడ్డూరం కాకపోతేనూ)
అమితాబ్ బచ్చన్ కి, అమిత్ షాకి రాలేదా కోవిడ్ మరి!!

పక్కింటాయనకి మధుమేహం (చక్కర వ్యాధి) వచ్చిందిట!

ఆ.... రాకేంచేస్తుంది స్వీట్లు గట్రా బాగా తింటూ ఉండుంటాడు
(పాపం ఆ జీవి నెలకో స్వీటు ముక్క కూడా తినడు)

పాపం రామారావుగారికి కాన్సర్ ట!

అయ్యో పాపం అనాలనే సంగతి మర్చిపోయి-కాన్సర్ రావడానికి కారణాలు అన్నీ ఏకరువు పెడతారు
(ఇదేమైనా వికీపీడియా,గూగులా-ఎం బి.బి.ఎస్ క్లాసా?)

పాపం రామారావుగారికి కాన్సర్ ట!

అయ్యో పాపం అనాలనే సంగతి మర్చిపోయి-కాన్సర్ రావడానికి కారణాలు అన్నీ ఏకరువు పెడతారు (ఇదేమైనా వికీపీడియా,గూగులా-ఎం బి.బి.ఎస్ క్లాసా?)

ఇదిగో ఇంకోళ్ళు...
సుబ్బారావుగారి అబ్బాయికి ఆక్సిడెంట్ అయ్యిందిట!

ఆ. అవదూ, అంత దూకుడుగా వెళ్తాడు మరి
(అసలు విషయం- ఎవడో వచ్చి గుద్దాడు ఆ అబ్బాయిని)
అంత "దూకుడు"గా ఉన్న మహేష్ బాబుకి ఎప్పుడైనా ఆక్సిడెంట్ అయిందా!!

ఇదిగిదిగో ఇంకోళ్ళు...

ఆ పక్క సందులో సుబ్బారావుగారి అమ్మాయి కాలుజారిందిట!

ఆ నేను అనుకుంటూనే ఉన్నా, ఇలాంటిదేదో జరుగుతుందని, ప్రతీ మాగాడితో పూసుకు తిరుగుతుంది- కాలుజారదు మరీ!

(అసలు విషయం ఆ అమ్మాయి కాలు జారి కిందపడింది- చెప్పే ఆవిడ చెప్పిన విధానం కూడా ఇలా ఉంటుంది ఒక్కోసారి)

రద్దీగా ఉండే సుల్తాన్ బజార్ లో ఇలా అందర్నీ పూసుకుంటూ వెళ్లినంత మాత్రాన కాలుజారినట్టేనా-వేషాలు కాకపోతేనూ!!

ఇలాంటివే బోలెడన్ని ఉంటాయి చెప్పుకుంటూ పొతే -ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! ఇది చదివిన తర్వాత మీకు తారసపడ్డ ఇలాంటి వ్యక్తులు గుర్తుకొచ్చివుంటారు.

డిస్క్లైమర్ (నిరాకరణ, తిరస్కరణ):

ఇందు మూలంగా నేను తెలియచేయునది ఏమనగా-ఇవి నేను రాసినవే అని అంగీకరిస్తూ ఎవర్నీ ఉద్దేశించి రాసినరాతలు కావు నావి అని మాత్రం తెలియచేస్తున్నా!

అలాగే జంధ్యాల గార్నిగానీ,వారి సినిమాల్లో పాత్రధారుల్నిగానీ కూడా.కేవలం వాటికి ఉత్తేజితుడనై (ఇన్స్పైర్), నిమిత్తమాత్రుడనై- “నీ- నా అనే తేడా లేకుండా” రాగద్వేషాలకు అతీతుడనై(గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పినట్టు) తమాషాకి రాసినవే గానీ- నాకు కనపడ్డవాళ్లలో కొందరిని ఉద్దేశించి ఏదో ఆషామాషీగా మాత్రం రాయలేదని గమనించగలరు.

ఇది చదివినవారిలో (అంతా నావాళ్ళే కాబట్టి- నీ,నా తేడాలేకుండా అని పైన రాసేశా ముందే) ఓ లక్షణంగానీ, అన్నిలక్షణాలుగానీ, కొన్నిలక్షణాలుగానీ, ఇంకా విశేషణమైన లక్షణాలు ఉన్నాగానీ (అవేవో నాకు మాత్రమే చెప్పండి)-

అది పూర్తిగా యాధృచ్ఛికమూ, కాకతాళీయమో తప్ప వారిని ఉద్దేశించి రాసినవి మాత్రం కాదు!

గమనిక:
ఇంత చెప్పినతర్వాత కూడా నా మీద కేసు వేసే ఉద్దేశం ఉంటే- మీకే డబ్బు బొక్క, తర్వాత మీ ఇష్టం!

# జయనగర్- హట్టి కాఫీ!

నాకూ మాఆవిడకి షాపింగ్ కి ఇష్టమైన ప్రదేశం "జయనగర్", ఏది కావాలన్నా  అక్కడ దొరికిపోతాయి.రకరకాల హోలిగేలు(బొబ్బట్లు)సుమారుగా పదిహేనుకిపైనే దొరుకుతాయి-మనముందే ఘటోత్గచుడి పొట్టంత ఇనప పెనంపై శుద్ధమైన నెయ్యితో వేడివేడిగా, అట్లకాడ వాడరు-పల్చగాఉంటాయి కాబట్టి-వెదురు బద్ద పల్చగా చెక్కినది వాడతారు. కాల్చిన తర్వాత మనకిచ్చే బొబ్బట్టుమీద తుప్ప (నెయ్యి) వేసి మరీ ఇస్తారు. ఆచుట్టూ పక్కలే బోలెడన్ని హోటల్స్ మంచి"టిఫినీలు-కాఫీలతో"సహా అన్ని రకాల చిరుతిళ్ళు దొరుకుతాయి"శాఖాహార ఆత్మారాముణ్ణి" శాంతింపచేయడానికి జయనగర్ అద్భుతమైన ప్రదేశం; బెంగుళూరు వచ్చినప్పటి నుంచి ఇక్కడకి తరచుగా వస్తూనే ఉంటాం.

ఆ మధ్య ఓరోజు ఈతరం కుర్రకారులో ఒకడు- నేనూ మాఆవిడా జయనగర్ షాపింగ్ కి వెళ్ళినప్పుడు మా మాటలు-యధాలాపంగా విన్నట్టున్నాడు! "తాతకు దగ్గులు నేర్పడం" అనే నా పదప్రయోగం విని దాని అర్ధం అడిగాడు;వాడి ఇంట్లో తాత ఖచ్చితంగా  ఉండి ఉండకపోవచ్చు-లేకపోతే అంత బుర్ర తక్కువ ప్రశ్న వేస్తాడా! నాకైతే చెప్పొద్దూ బోలెడు సంతోషం వేసింది.

తెలుగు మాటలు విన్నందుకు కాదు- బెంగుళూరులో బోలెడంతమంది తెలుగు వాళ్ళు ఉన్నారు.అదీ కాకుండా కన్నడిగులు మనం ఎక్కడ కష్టపడిపోతామో అని మన కోసం తెలుగులోనే,ఇంగ్లీషులోనో, హిందీలోనో మాట్లాడే ప్రయత్నం చేస్తారు- అందుకే మనకు కన్నడ ఎక్కువగా రాకపోవడానికి కారణం.

మద్రాస్ మహానగరంలా కాదు- ఆమ్మో,మద్రాస్ లో వాళ్లకి మిగిలిన భాషలు వచ్చినా-అరవరు కానీ,చచ్చినా అరవం తప్ప వేరే భాష మాట్లాడరు. పరబాషా బాధితుణ్ని అడ్డంగా ఆడేసుకుంటారు ఆ ఊళ్ళో అడుగుపెట్టింది మొదలు మనం ఆ ఊరునించి వెళ్లేంతవరకూ.నాలుగైదు సంవత్సారాల క్రితం వరకు నా అనుభవం ఇదే,ఇప్పుడు ఏమైనా కొద్దిగా మారివుంటే సంతోషం-నేనూ మార్చుకుంటా నా అభిప్రాయాన్ని!

ఈ కాలం పిల్లలు మనం చెప్పే మాటలే వినరు (అసలు రహస్యం ఏమిటంటే వాళ్ళు వినిపించుకోరు- చెవులో ఇయర్ బడ్స్ పెట్టుకుంటారుగా, చరవాణితో కలిపిన తీగతో) అలాంటిది ఆ కుర్రాడు వాడంతటవాడు వచ్చి అడిగితే -నిజం చెప్పొద్దూ- నాకు ఆ కుర్రకుంక సాష్టాంగప్రణామం చేసినట్టు అనుభూతి చెందాను.ఆ పిల్లాడికి మాతో బాటే- "హట్టి కాఫీ" వాడి దగ్గర ఓ మాంచి ఫిల్టర్ కాఫీ చేతికి ఇప్పించి ఇంక అందుకున్నాను- దొరికాడు కదా అని.

మా ఆవిడకి విషయం అర్థం అయ్యి-"మీరు మాట్లాడుతూ ఉండేది,కావేరి షో రూమ్ దాకా వెళ్లి వస్తా" అంది-నాకు తెలుసు ఆవిడా ఓ గంటదాకా బయటకు రాదనీ! జంధ్యాల సినిమాల్లో అరగుండు బ్రహ్మానందాన్ని సుత్తివీరభద్రరావు ఆడుకుంటాడే అలాగన్నమాట!

ఇక మొదలు పెట్టా!

తాతకు దగ్గులు నేర్పడం అంటే- ఏమిటో సూటిగా చెప్పకుండా!!!

ఫ్యానుకి చెమట పట్టించాలి అని అనుకోవడం!

సూర్యుడికి వేడి పుట్టించడం నేర్పాలనుకోవడం!

చంద్రుడుకి వెలుగునివ్వడం నేర్పాలనుకోవడం!

మేఘానికి వర్షం ఇవ్వడం నేర్పాలనుకోవడం!

చెట్టుకి గొడుగు పట్టడం నేర్పాలనుకోవడం!

చెప్పులకి నడక నేర్పాలనుకోవడం!

నోటికి మాట నేర్పాలనుకోవడం!

గొంతుకు పాట నేర్పాలనుకోవడం!

కళ్ళకి చూపు నేర్పాలనుకోవడం!

చెవులకి వినడం నేర్పాలనుకోవడం!

గుండెకు చప్పుడు నేర్పాలనుకోవడం!

నాలుకకు రుచి నేర్పాలనుకోవడం!

తల్లులకు కాన్పు నేర్పాలనుకోవడం!

డాక్టర్లకి మందుల చీటీ రాయడం నేర్పాలనుకోవడం!

“టిమ్ కుక్” కి మొబైల్ ఫోన్లు ఎలా తయారుచేయాలో చెప్పబోవడం!

“సుందర్ పిచాయ్ కి, సత్య నాదెళ్లకు” అంతర్జాలం గురించి చెప్పాలనుకోవడం!

“జుకెర్ బర్గ్” కి పిచ్చి రాతలు,పుకార్లు,తప్పుడు రాతలు ఎలా రాయాలో నేర్పబోవడం!

“జెఫ్ బెజోస్” కి అడ్డమైన చెత్తా, తనకు ఇష్టమైన ధరలో ఎలా అమ్మలో చెప్పాలనుకోవడం!

లాయర్లకి అబద్ధాలు ఎలా చెప్పాలో తర్ఫీదు ఇవ్వాలనుకోవడం!

నా మాటల ఒరవడి మధ్యలో ఆ కుర్రకుంక “అంకుల్ ఈ సారి నేను కాఫీ తెస్తాను” అన్నాడు, ఆ వంకన ఎక్కడ పారిపోతాడో అనుకున్నా.బుద్ధిమంతుడులా ఉన్నాడు, ఓ మంచి కాఫీ తెచ్చి నా చేతిలో పెట్టి తానూ తాగడం మొదలు పెట్టాడు- నాచేతిలో కాఫీ కాదు వాడిచేతిలో కాఫీ.

తర్వాత ఆ కుర్రాడి మాటల్లో అర్థం అయింది ఏమిటంటే, వీళ్లూ తెలుగువాళ్ళే, రెండు తరాల నుంచి ఇక్కడ ఉండటంవల్ల, తెలుగు కన్నడా కలిపి (తెలుగు లిపి కన్నడ లిపి కవలపిల్లల్లా ఉంటాయి కూడానూ) -కన్నడ తెలుగు వాళ్ళలా మాట్లాడుతున్నాడు. కాకపోతే ఇంట్లో అందరూ తెలుగే మాట్లాడుతారుట (ఇలాంటి తెలుగే)

అన్నీ విని"అంకుల్ నాకు తెలిసిన విషయాలే మీరు మరో రకంగా చెప్పారే భలేగా" అన్నాడు-అది మెచ్చుకోలో, శ్లేషో మరి!ఇక్కడ పుట్టి పెరిగిన తెలుగు పిల్లాడు కదా- అంత పరిజ్ఞానం, భాష మీద పట్టు ఉంటాయనుకోను-మెచ్చుకోలే అయుంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో ఉంటూ కూడా చక్కటి తెలుగు మాట్లాడని వాళ్ళకంటే, అసలు తెలుగే మాట్లాడని వాళ్ళకంటే వీళ్ళు నయం కదా.కన్నడ సంస్కృతిని అక్కున చేర్చుకొని, మాతృ బాషని మరువకుండా ఉన్నారు-పోన్లే అనుకున్నా! పిల్లాడు ఇంజనీరింగ్ చదువుతున్నాడుట-వాడి స్నేహితుల కోసం ఎదురుచూస్తూ “నాకు దొరికిపోయాడు ఇలాగా” అనుకున్నా మనసులో;ఇంత ఓపికగా విన్నందుకు నాకు ముచ్చటేసి నా మనసులో మాట అనేసా.

“అదేం లేదు అంకుల్ మీలాంటి వాళ్ళతో మాట్లాడితే కాస్త విషయాలు తెలుస్తాయి” అన్నాడు.మాటల మధ్యలో నారాతల గోల వాడి చెవిలో వేయడం వల్ల- నా ఫోన్ నెంబర్, వెబ్ సైట్ వివరాలు పంపమన్నాడు- వాడి ఫోన్ నెంబర్ కూడా ఇచ్చి.

అప్పుడు అనుకున్నా ఇప్పటి కుర్రాళ్ళు ఏమో అనుకుంటాం గానీ- ఈ రోజుల్లో ఇలాంటివాళ్ళు కూడా కొద్దిమంది ఉంటారని అనుకుంటూ ఉంటాం కదా- అది వాస్తవమే;అంతేగానీ, నామాటలు చెవికి ఎక్కించుకున్నాడని  కాదు నేచెప్పడం!

ఇక బయలుదేరదాం అనుకుంటున్నప్పుడు మా ఆవిడ రానేవచ్చింది కావేరి నుంచి- (మాండ్యా దగ్గర ఉన్న కావేరి నది దగ్గర నుంచి కాదు-కావేరి వాళ్ళ దుకాణం నుంచి)  ఆపిల్లాడు నవ్వుతూ మాఇద్దరి దగ్గరా సెలవు తీసుకున్నాడు-

“మీకు ఎవడో బకరా దొరికినట్టున్నాడే చాలా రోజులకి” అంది- ఒక విధంగా చూస్తూ-ముప్పయి ఏళ్ళనుంచి కలిసివుంటున్నాం-ఆవిడ మాటల్లో విరుపు శ్లేష అర్థం అవకనా ఏంటి- అర్థం అవనట్టు మొహం పెట్టడం నేను నేర్చుకున్న విద్య- ఈ ముప్పయి ఏళ్లలో!

ఇవాళ్టికి జయనగర్ షాపింగ్ అయిపోవడంతో కార్ పార్కింగ్ దాకా నడుచుకుంటూ వెళ్లి ఇంటికి బయలుదేరాం.బెంగుళూరులో కార్ పార్కింగ్ వెతుక్కోవడానికే బోల్డు సమయం పడుతుంది.ఒక్కో సారి కార్ పార్కింగ్ దొరకక ఇంటికి వెనక్కి వచ్చేసిన రోజులు కూడా ఉన్నాయి. రాంగ్ పార్కింగ్ లో పొరపాటున పెట్టామా, వెయ్యి రూపాయల జరీమానా, ఓ వందో రెండొందల దక్షిణ ఇక్కడ పోలీస్ లు తీసుకోరు!

మన ఊరినుంచి  పోలీసుల్ని తీసుకొచ్చి వీళ్ళకి ట్రైనింగ్ ఇప్పించాలి ఈ విషయంలో;ఈ జరీమానాల్లో కొద్ది రాయితీ అన్నా ఇస్తారు-జీవితంలో ప్రభుత్వ రాయితీలు ఏవీ అందిన, పొందిన జీవిని కాదుగా మరి!

అదండీ మా జయనగర్ పర్యటనలో ఓరోజు జరిగిన ప్రహసనం!

## స్నానం-వాటిలో రకాలు!!!!

రోజూ చేసే స్నానమేగా- ఇందులో ఏమిటీ విశేషాలు,రకాలు అనుకుంటున్నారా!

మీరు ఎవరెవరు ఎలా స్నానం చేస్తారో అన్న సంగతి పక్కన పెడితే- స్నానం చేయడంలో రకాలు కొద్దిగా తెలుసుకుందాం- చిన్నవైనా, సిల్లీగా ఉన్నా కొత్త విషయాలు ఎప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. దశాబ్దాలుగా మన సినిమావాళ్లు  హీరో, హీరోయిన్, విలన్, పాటలు, ఫైట్లు - వీటినీ అటూ ఇటూగా ఎవరి పంథాలో వాళ్ళు చూపించడంలా మనం పుట్టకముందునుంచి- చెప్పే విధానం- అదే కథనం తేడా అంతే-స్నానాల గొడవా అంతే మరి.

స్నానం రెండు పొద్దులా చేసేవాళ్ళు!
ఒక పూటే చేసే వాళ్ళు!
ఒక పూట కూడా చేయనివాళ్ళు!
రెండు మూడు రోజులకొకసారి చేసేవాళ్ళు!
వారానికొక సారి చేసేవాళ్ళు-జుమ్మా సే జుమ్మా లాగా అన్నమాట!

వివరాల్లోకి వెళ్దాం...

## కాకి స్నానం!

చెంచాడు నీళ్లు చాలు వీళ్ళకి- బహు పొదుపరులు, కోటా శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్ లాగా!!

నదీస్నానం-సముద్రస్నానం!
పుణ్యం వస్తుందని చేసేవాళ్ళే ఎక్కువ- చేసిన పాపమ్ పోయి పుణ్యం పుచ్చిపోయేట్టుగా వస్తుందని ఆశించేవాళ్లూ ఉన్నారనుకోండి!

## బావి స్నానం!

బావిలో నీళ్లు ఇంకేంత వరకూ చేయగలరు వీళ్ళు,పక్కనున్న వాళ్ళు అడ్డుచెప్పక పోతే-బావులే మాయం అయిపోయిన రోజులు ఇవి-బావి అంటే ఏమిటి అని మాత్రం అడక్కండి.చిన్నప్పుడు ఇంట్లోకి కావాల్సిన నీళ్లు తోడి బావి దగ్గరే స్నానం చేసినవాళ్ళం- వేసవిలో బావి స్నానం మజాయే వేరు-ఒళ్ళు పగిలిపోయే మిట్టమధ్యాహ్నం ఎండ భరించిన తర్వాత- చెమట పొక్కులు వస్తాయని ఇంట్లోవాళ్ళు వారించినా-వేడి తాపానికి భరించలేక వాళ్ళ మాటలు లక్ష్యపెట్టేవాళ్ళమే కాదు!

## సరిగంగ స్నానం!

సాధారణంగా కొత్త దంపతులకు పరిమితమైంది ఇది- ఈ రోజుల్లో ఈ తరం ప్రేమ పక్షులు కూడా ఇలా తడుస్తున్నారని అక్కడా ఇక్కడా వినికిడి అయితే ఉంది-నిజానిజాలు ఎంత వరకో తెలియకపోయినా!

## ఏనుగు స్నానం!

ఎన్ని నీళ్ళైనా చాలవు వీళ్ళకి-ఇలాంటి ఉన్న ఇళ్లల్లో,ముందుగా ఇంట్లోవాళ్ళు అందరూ స్నానాలు చేసి గానీ, వీళ్ళని స్నానానికి వదలరు. పొరపాటున వీళ్ళు ముందు వెళ్ళారా- అంతే సంగతులు -ఇంటిల్లిపాదికి స్నానానికి నీళ్లు ఉండవు- అందరూ ఒంటిమీద సెంటు వేసుకోవాల్సిందే ఆ రోజుకి- మన ఇంట్లోవాళ్ళే కదా అని సెంటు వేసుకోకుండా ఉండలేంగా మరి!

నాకు అర్ధం కాదు శరీరంలో ఉండే అవయవాలు అందరికి ఒకటే,కొందరికి ప్రత్యేకంగా ఎక్కువేమీ ఇవ్వలేదుగా భగవంతుడు -కొద్దిగా పరిణామాలు తేడా,దానికి అన్ని నీళ్లు ఎందుకో! అదీ నిజమే- ఎన్ని నీళ్లు ఉన్నా,చాలని వాళ్ళు ఉంటే, కొన్ని నీళ్లున్నాసర్దుకునే వాళ్ళూ ఉంటారు.శరీరం పరిమాణాన్ని బట్టి స్నానం చేయంగా- ఏదో అలవాటుగా చేసేస్తాం- అంతే.స్నానం తర్వాత శరీరం శుభ్రంగా ఉండాలి అంతేగా- పక్కవాడు వాసన అని చెప్పలేక మన పక్కనించి వెళ్ళగానే ముక్కు మూసుకునేట్టు ఉండకూడదు.లేదంటే

“స్నానం చేయలేదా అనో,స్నానం చేసి రాకపోయావో” అని అనకూడదు- అంతవరకే గానీ స్నానం అనేది ఓ యజ్ఞంలా చెయ్యక్కరలేదని నా అభిప్రాయం! కాదూ కూడదు అనేవాళ్ళు అలాగే కానివ్వండి- మీ ఇల్లు, మీ ఒళ్ళు, మీ నీళ్లు- మధ్యలో నేనెవర్ని కల్పించుకోవడానికి!

## గోడమీద నాలుగు మగ్గుల స్నానం!

ఏదో గోడకు చేయించే స్నానం అనుకోకండి! వీళ్ళు స్నానం చేసాం అని బయటవాళ్ళకి భ్రమ కల్పించడానికి బాత్ రూమ్ లోకి వెళ్లి వస్తారు-రెండు మగ్గులు ఒంటిమీద మిగిలిన రెండు మగ్గులు గోడమీద పోస్తారు- తర్వాత వెళ్లినవాళ్ళు అనుమానించకుండా-ఈ తెలివితేటలకేం కొదవలేదు.నాలుగు మగ్గులేమిటి, రెండు మగ్గులతో అయినా స్నానం పూర్తి చేస్తారు-మహానుభావులు.

## చప్పుడు స్నానం!

వీళ్ళు చేసే చప్పుడుకి ఇంట్లోవాళ్ళకే కాకుండా ఇరుగుపొరుగుకు కూడా తెలుస్తుంది వీళ్ళు స్నానం చేస్తున్నారని.వీళ్ళని అడిగిచూసాగానీ వీళ్ళ ఈవైఖరికి కారణం మాత్రం తెలియలేదు నాకు-బహుశా వాళ్ళకీ తెలియదనుకుంటాను.

## కుళాయి స్నానం!

మున్సిపాలిటీ వాళ్ళు కుళాయిలు కట్టేంతవరకూ చెయ్యగలరు మధ్యలో మంచినీళ్ల బిందెల వాళ్లకి కాస్త చోటిచ్చి.ఇప్పటికీ నగరాల్లో ఉన్న చిన్నచిన్న బస్తీల్లో ఈ దృశ్యాలు కనపడుతూ ఉంటాయి అప్పుడప్పుడు.

వీళ్ళకి మాత్రం చక్కటి నియమం ఉంది- మిగిలిన రకాలుగా స్నానం చేసేవాళ్లలాగా కాదు- కుళాయిలో నీళ్లు వస్తేనే స్నానం- లేదంటే లేదు.వీళ్ళ ఉద్దేశం ప్రకారం- కుళాయి తప్పు గానీ వీళ్లది కాదు- వీళ్ళు స్నానం చెయ్యకపోవడం అనేది.

## గుండిగతో, గంగాళంతో స్నానం!

ఈ రకమైన స్నానం మనకు పల్లెల్లో తప్ప కనపడదు- గుండిగ,గంగాళం అంటే మాత్రం నే వర్ణించలేను.పల్లెటూరు నేపథ్యం ఉన్నవాళ్ళుగానీ, పల్లెటూరు చూసిన వాళ్లకి గానీ ఈ రకం స్నానాలు తెలుస్తాయి

## సామూహిక స్నానాలు!

సామూహిక వివాహాలు విని ఉంటారు,ఇది బహుశా చాలామంది విని ఉండరు; సామూహికంగా అన్నాకదా అని-శ్రీకృషుడి లెవెల్లో చెట్టెక్కి మీరు ఏవేవో ఊహించుకోనక్కర్లేదు - ఇవి పక్కాగా చిన్నపిల్లలకి మాత్రమే పరిమితమయిన ప్రక్రియ.కాకపోతే పెద్దా చిన్నా,ముసలి ముతకా అందరూ పుష్కరాల సమయంలో, కార్తీకమాసంలో ఈ సామూహిక స్నానాలు చేస్తారు.

కాకపోతే పూర్వం పెద్ద బావుల్లోనూ,చెరువుల్లోనూ, కొలనుల్లోనూ, ఇప్పటికీ గోదావరి ఒడ్డున కాల్వల్లోనూ కనపడతాయి"తూగోజీ- పాగోజీ"వాళ్లకి బాగా పరిచయం- అక్కడ పుట్టి పెరిగిన వాళ్లయితే ఇలాంటి స్నానాలు వాళ్ళకి సుపరిచితమే.నా లెక్క ప్రకారం వీళ్ళు ఆ ప్రాంతాలకి వెళ్ళినప్పుడు- మనసు పీకుతూ ఉండొచ్చు, కొందరైతే పాతస్నేహితులతో ఇలాంటి స్నానాలు చేస్తున్నా ఆశ్చర్యం లేదు.

ఇంకా ఒకటో రెండో రకాలు ఉండి ఉంటాయి, ఏదో నాకు గుర్తున్నంతవరకు రాసాను- ఏట్లో, గోదాట్లో కాకుండా!

ఇప్పుడు చెప్పండర్రా- గుండెమీద చేయి వేసుకొని- వద్దులేండి మీవంటిమీద ఒట్టు వేసి చెప్పండి-ఇన్నిరకాల స్నానాలు మీకు తెలుసనీ- బహుకొద్దిమందికి తప్ప!
కాకపోతే ఈ తరం వాళ్ళు మాత్రం "త్రివిక్రమ్, కృష్ణ వంశీ, శ్రీకాంత్ అడ్డాల" సినిమాల్లో కొన్ని రకాలు చూసి ఉంటారు.కావాలనే కె.రాఘవేంద్రరావు సినిమాల స్నానాలు రాయలేదు- అయన దేనితో అయినా స్నానం చేయిస్తాడు- అవన్నీ మనందరం చూసినవే- ప్రత్యేకంగా రాయనక్కరలేదు!

ఇది మాత్రం నేను శుచిగా స్నానం చేసే రాసాను!

# చమురు!!!

“చమురు” సాధారణ భాషలో ఇంధనం,నూనె అంటారు- కానీ ఇదే పదాన్ని వివిధ సందర్భాలలో వాడటం రివాజు-సందర్భాన్ని బట్టి అర్థం మారుతుంది! చేతి చమురు: చేతిలో డబ్బులు ఖర్చవడం-వృధాగా అని భావం. మామూలు ఖర్చుకు కూడా ఈమాట వాడే లోభులుంటారు ఈ లోకంలో-అది వేరే సంగతనుకోండి! ఒంటి చమురు వదిలించుకోవడం: ఒంటికి అంటిన మలినం,మలికి, మురికి వదిలించుకునే ప్రయత్నం చేయడం ప్రతీ దీపావళికి ఒంటికి దట్టంగా శ్రేష్టమైన నువ్వులనూనెని పట్టించుకుని ఓ అరగంట పైగా ఎండలో నిలబడి,పిదప నీటితో కలిపిన సున్నిపిండితో ఒళ్లంతా పట్టించి కాసేపు ఆరనివ్వడం.

తదనంతరం ఒంటిపైఉన్న ఆ సున్నిపిండిని బాగా మెలిపి నలిపే పనిచెయ్యడం, దాని పర్యవసానంగా ఒంటికి ఉన్న మురికిని సున్నిపిండి ఆప్యాయంగా తనలో తీసుకుని మనం నలిపినప్పుడు కిందపడుతుంది!

దీపావళికి మాత్రం ఈ కార్యక్రమం తప్పనిసరి! ఈ కార్యక్రమం మధ్యలో వచ్చే కొన్ని పండుగలప్పుడు కూడా చెయ్యడం రివాజు-దీపావళికే కాకుండా! అసలు ఈ కార్యక్రమం అయిన తర్వాత స్నానం చేసి ఓ నిద్ర వేస్తే-ఇంట్లోవాళ్ళు లేపేదాకా మెలకువే రాదు- ఆ నిద్ర హాయ్ వేరు- అమర్థం....

ఇప్పుడు షాంపూ స్నానాలు,సబ్బుతో ఒళ్ళు కడగటమూనూ ఓ బకెట్టుతో-మరి ఒంటిమురికి ఎలా వదులుతుంది. మన మనస్సులో మురికి లాగా ఒంటిమీద కూడా అలాగే కొంత ఉండిపోతుంది.దానికి తోడు మంచిబట్టలు కట్టుకుంటాం,మంచిగా మాట్లాడతామాయె-ఒంటిమీద మురికి-ఒంటిలోన మురికి పరులకు కనపడదుగా!

తల చమురు: తలకి రాసుకునే నూనెలు-ఇప్పుడు ఈ అలవాటు దాదాపుగా మృగ్యమై పోయింది; నూనె రాసే తలకాయలే కనపడవు! దీపాలు వెలగాలన్నా మన పొట్టలోకి ఏదైనా వెళ్లాలన్నా చమురు లేందే ఒక్క క్షణం గడవదు.చమురు లేకుండా మన వాహనాలు ఎలా కదలటానికి మొరాయిస్తాయో చూస్తూనే ఉన్నాం కదా!

చమురు మన నిత్యజీవితంలో చాలా ముఖ్యమైనపాత్ర పోషిస్తుంది చమురులేకుండాఒక్కరోజు కూడా గడవదు అంటే అతిశయోక్తి కాదు; చమురుకి ఇంకొక ప్రాముఖ్యత ఏంటంటే "ఇంటికి దీపం ఇల్లాలు" అన్నారు కదండీ పెద్దలు-అలాగే చమురు లేకుండా దీపం వెలగదు కదా మరి-కానీ ఆ దీపానికి చమురు మాత్రం మాగాడేనండి-కాదంటారా!

ఇదేదో పురుషాహంకారంతో అనట్లేదు,జీవిత సత్యం- ఏ కాలమైనా.పెళ్ళీ పెటాకులు లేకుండా సహజీవనం చేసేవాళ్ళని నేను పరిగణలోకి తీసుకోలేదు మరి- అయినా వాళ్ళకీ సామెత వర్తించదుగా- వాళ్ళు ఇల్లాళ్లు కాదుగా! అందుకని వాళ్ళు కూడా నా మాటల్ని పట్టించుకోరు!

ఏదో చమురు గుర్తుకొచ్చి ఇవన్నీ గబగబా రాసేశా!

ఇక చమురు చూసినప్పుడు,గుర్తుకొచ్చినప్పుడు-ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని అనవసరంగా చేతి చమురు మాత్రం వదిలించుకోకండి!